జర్నలిస్ట్ డైరీ

తెలుగు దినపత్రిక



సంపుటి :13 సంచిక :86 ఆదివారం | 29-11-2026 పేజీలు:8 వెల:రు 3

https://www.epaperjournalistdiary.com/

చంద్రబాబు, జగన్
తక్షణమే గళమెత్తాలి



- ఢిల్లీ నుంచి రాహుల్ గాంధీ పిలుపు
- లోక్‌సభ స్థానాలను 850కి పెంచే యోచనపై రాహుల్ గాంధీ అభ్యంతరం
- మహిళా రిజర్వేషన్ల అమలుకు ప్రస్తుతమున్న 543 స్థానాలే సరిపోతాయన్న ప్రకటన
- తాజా కులగణన ఆధారంగానే నియోజకవర్గాల ప్రక్రియ చేపట్టాలన్న డిమాండ్
- రాజ్యాంగ విలువల రక్షణకు ముందుకు రావాలని చంద్రబాబు, జగన్‌లకు విజ్ఞప్తి
- దేశ ప్రజాస్వామ్య భవిష్యత్తు కోసం యువత గళం విప్పాలని రాహుల్ పిలుపు

మహిళా రిజర్వేషన్లను ఎవరూ అడ్డుకోలేరు

చట్టసభల్లో మహిళలకు 33 శాతం కోటా అమలు చేస్తాం

- చట్టసభల్లో మహిళలకు 33 శాతం కోటా అమలు చేస్తాం
- నారీశక్తికి ఇచ్చిన హామీని నెరవేర్చేందుకు కట్టుబడి ఉన్నాం
- రిజర్వేషన్ల మార్గంలోని అడ్డంకులను తొలగిస్తాం : ప్రధాని మోదీ
- ఈ నెల 30 నుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు
- నియోజకవర్గాల పునర్విభజన బిల్లులపై చర్చ
- మహిళా రిజర్వేషన్ బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టే యోచన
- సభా కార్యకలాపాలకు సహకరించాలి: కిరణ్ రిజిజు
- ప్రత్యేక సమావేశాలపై విపక్షాల అభ్యంతరాలను తోసిపుచ్చిన కేంద్రం





లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేసి తీరుతామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. నారీశక్తికి ఇచ్చిన హామీని నెరవేర్చేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, రిజర్వేషన్ల అమలుకు ఎదురయ్యే అడ్డంకులన్నింటినీ తొలగిస్తామని భరోసా ఇచ్చారు. ఈ నెల 30 నుంచి ప్రారంభమయ్యే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ బిల్లులపై చర్చ జరగనుంది. డీలిమిటేషన్ బిల్లుల పరిశీలనకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఇప్పటికే లోక్‌సభకు సిఫార్సు చేయగా, సమావేశాలు సజావుగా సాగేందుకు విపక్షాలు సహకరించాలని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు విజ్ఞప్తి చేశారు.




ఢిల్లీకి సీఎం
రేవంత్‌రెడ్డి

- నేడు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రుల భేటీ
- డీలిమిటేషన్ బిల్లుపై ప్రధానంగా చర్చ
- మహిళా రిజర్వేషన్ల అమలుపైనా సమాలోచనలు
- శనివారం రాత్రి దేశ రాజధానికి చేరుకున్న ముఖ్యమంత్రి
- తెలంగాణ, కేరళ, కర్ణాటక సీఎంల సమావేశం
- దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ప్రాతినిధ్యంపై చర్చ
- లోక్‌సభ, అసెంబ్లీల్లో 50 శాతం సీట్ల పెంపు ప్రతిపాదనపై సమీక్ష
- పార్లమెంట్ సమావేశాలు ముగిసే వరకు ఢిల్లీలోనే సీఎం

హైదరాబాద్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం రాత్రి ఢిల్లీకి వెళ్లారు. సోమవారం నుంచి పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో డీలిమిటేషన్ బిల్లు, మహిళా రిజర్వేషన్ల అమలు అంశాలపై ఆదివారం దేశ రాజధానిలో జరిగే కీలక సమావేశాల్లో ఆయన పాల్గొననున్నారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రుల భేటీకి హాజరుకానున్నారు. పార్లమెంట్ సమావేశాలు ముగిసే వరకు రేవంత్‌రెడ్డి ఢిల్లీలోనే ఉండనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల్లో ప్రస్తుతం ఉన్న స్థానాల సంఖ్యను 50 శాతం పెంచేందుకు ఉద్దేశించిన 132వ రాజ్యాంగ సవరణ బిల్లుకు

-మిగతా 2 లో



ఎట్టకేలకు తిరుప్పరంకుండ్రం దీపత్తూన్ వద్ద వెలిగిన కార్తీక దీపం

- సుప్రీంకోర్టు ఆదేశాలతో తిరుప్పరంకుండ్రంలో కార్తీక దీపోత్సవం
- కొండపై ఉన్న ప్రాచీన రాతి స్తంభంపై దీపం వెలిగించిన అర్చకులు
- దర్గా చుట్టూ 50 మీటర్ల బఫర్ జోన్ మరియు సీఆర్‌పీఎఫ్ భద్రత
- కొండపైకి 50 మంది భక్తులకు మాత్రమే అనుమతి
- కోర్టు ధిక్కార పిటిషన్‌తో చర్యలు చేపట్టిన తమిళనాడు యంత్రాంగం


డీలిమిటేషన్ బిల్లును వ్యతిరేకించండి



- అన్ని పార్టీలకు, ఎంపీలకు కాక్రోచ్ జనతా పార్టీ పిలుపు
- బిల్లు ఆమోదానికి సహకరించవద్దని విజ్ఞప్తి
- మద్దతు తెలిపే పార్టీలు ప్రజల తీర్పుకు ద్రోహం చేసినట్లే
- నియోజకవర్గాల సరిహద్దుల్లో పక్షపాత మార్పుల ప్రమాదం
- అధికార పార్టీకి అనుకూలంగా నిర్ణయాలు జరిగే అవకాశం
- బిల్లు ప్రభావాలపై ప్రజలకు వివరించాలని డిమాండ్

ఢిల్లీలో ప్రమాదకర
స్థాయికి వాయు కాలుష్యం

- ఏక్యూఐ 454కు చేరిక.. నగరవాసుల్లో ఆందోళన
- నవంబర్ 21 తర్వాత మళ్లీ గరిష్ఠ స్థాయిలో కాలుష్యం
- పీఎం2.5 కాలుష్యంలో వాహనాల వాటా 32 శాతం
- బయోమాస్ వ్యర్థాల దహనంతో 22.8 శాతం కాలుష్యం
- అర్ధరాత్రి తర్వాత ఒక్కసారిగా పెరిగిన తీవ్రత
- గాలి వేగం తగ్గడంతో వాతావరణంలో పేరుకుపోతున్న కాలుష్య కారకాలు
- వారాంతంలో మరింత దిగజారే అవకాశం
- పిల్లలు, వృద్ధులు అప్రమత్తంగా ఉండాలని నిపుణుల సూచన



డీలిమిటేషన్‌కు మేం సై

మహిళా రిజర్వేషన్ బిల్లుకూ మద్దతు ఇస్తున్నాం



- కేంద్రం ప్రతిపాదనను స్వాగతిస్తున్నాం
- తెలంగాణ ప్రయోజనాలే మాకు ముఖ్యం
- తెలంగాణ లోక్‌సభ స్థానాలు 17 నుంచి 26కు పెంపు
- దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యానికి భద్రత కల్పించాలి
- అనుకూలంగా ఓటు వేయనున్న ముగ్గురు రాజ్యసభ సభ్యులు
- ఎక్స్ వేదికగా వెల్లడించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

02

డీలిమిటేషన్ ప్రక్రియకు తమ పార్టీ మద్దతు ఇస్తుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన నియోజకవర్గాల పునర్విభజనను స్వాగతిస్తున్నామని, అయితే ఈ ప్రక్రియలో తెలంగాణ ప్రయోజనాలకు ఎలాంటి నష్టం కలగకుండా చూడాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు. రాష్ట్ర హక్కులు, ప్రయోజనాల పరిరక్షణే తమకు ప్రధానమని తెలిపారు. మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లుకూ బీఆర్ఎస్ మద్దతు ఇస్తుందని వెల్లడించారు. డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ల అంశాలపై కేంద్రం తీసుకునే నిర్ణయాల్లో తెలంగాణకు న్యాయం జరగాలని కేటీఆర్ ఆకాంక్షించారు.



కేంద్ర డీలిమిటేషన్ బిల్లుకు డీఎంకే గ్రీన్ సిగ్నల్..

- స్టాలిన్ పెట్టిన షరతులకు మోదీ సర్కార్ ఓకే!
- డీలిమిటేషన్ బిల్లుకు మద్దతు ప్రకటించిన డీఎంకే పార్టీ
- స్టాలిన్ ప్రతిపాదించిన నిబంధనలకు కేంద్రం అంగీకారం
- లోక్‌సభలో డీఎంకేకు ఉన్న 22 మంది ఎంపీల బలం ఎంతో కీలకం
- రాష్ట్రాల ప్రాతినిధ్య వాటా మారకుండా 50 శాతం సీట్ల పెంపు
- డీఎంకే మద్దతుపై మండిపడుతున్న అధికార టీవీకే పార్టీ
- బిల్లును వ్యతిరేకించాలంటూ డీఎంకేకు సీఎం విజయ్ సవాల్

02



తెలంగాణలో ఐపీఎస్
అధికారుల బదిలీలు

- హెచ్ఎండీఏ కమిషనర్‌గా ఈవీ నరసింహారెడ్డి
- నగరాభివృద్ధి శాఖ కార్యదర్శిగా సర్ఫరాజ్ అహ్మద్
- హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీగా అజిత్ రెడ్డికి అదనపు బాధ్యతలు
- జీహెచ్ఎంసీ ప్రత్యేక అధికారిగా సర్ఫరాజ్ అహ్మద్
- శంషాబాద్ జోనల్ కమిషనర్‌గా మయాంక్ మిట్టల్
- హెచ్ఎండీఏ జాయింట్ కమిషనర్‌గా కె. చంద్రకళ
- మెట్రో రైల్ జేఎండీగా మనోజ్‌కు బాధ్యతలు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

హైదరాబాద్

హైదరాబాద్ నగర పాలన, మౌలిక వసతుల అభివృద్ధికి సంబంధించిన కీలక విభాగాల్లో తెలంగాణ ప్రభుత్వం భారీగా అధికారుల బదిలీలు చేపట్టింది. పలువురు ఐఏఎస్, నాన్ కేడర్ అధికారులకు కొత్త బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జీవో ఆర్టీ నంబర్ 1740 ద్వారా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మార్పుల్లో హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ, మెట్రో రైల్, మూసీ నది అభివృద్ధి సంస్థ, జీహెచ్ఎంసీ విభాగాలకు ప్రాధాన్యం కల్పించారు. 2009 బ్యాచ్‌కు చెందిన సర్ఫరాజ్ అహ్మద్‌ను హెచ్ఎండీఏ మెట్రోపాలిటన్

-మిగతా 2 లో

మహిళా రిజర్వేషన్లను ఎవరూ అడ్డుకోలేరు

న్యూఢిల్లీ



లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లను అమలు చేసి తీరుతామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. మహిళా రిజర్వేషన్లను వ్యతిరేకించే పార్టీలు వాటి అమలును అడ్డుకోలేవని వ్యాఖ్యానించారు. ఈ నెల 30 నుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో శనివారం సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఆయన ఓ వీడియోను పోస్టు చేశారు. దేశంలోని నారీశక్తికి ఇచ్చిన హామీని నెరవేర్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. మహిళలకు రాజకీయాల్లో సముచిత భాగస్వామ్యం కల్పించాలన్న సంకల్పంలో వెనక్కి తగ్గేది లేదని తెలిపారు. రిజర్వేషన్ల అమలుకు ఎదురయ్యే ప్రతి అడ్డంకిని తొలగిస్తామని భరోసా ఇచ్చారు. మహిళలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలన్న పోరాటం దశాబ్దాలుగా కొనసాగుతోందని మోదీ గుర్తుచేశారు. ఈ లక్ష్య సాధన కోసం తాను కూడా ఎన్నో ఏళ్లుగా కృషి చేస్తున్నానని చెప్పారు. మహిళలు తనకు లేఖలు రాస్తూ తమ ఆకాంక్షలను తెలియజేస్తున్నారని, దేశంలోని మహిళల ఆశీర్వాదం తమకు ఉందని పేర్కొన్నారు. పార్లమెంట్, రాష్ట్ర శాసనసభల్లో మహిళల ప్రాతినిధ్యాన్ని పెంచే విషయంలో ప్రభుత్వం దృఢంగా ఉందని పునరుద్ఘాటించారు. మరోవైపు నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన రెండు బిల్లులను పరిశీలించాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము లోక్‌సభకు సిఫార్సు చేశారు. రాజ్యాంగంలోని 117(3) అధికరణం ప్రకారం ఈ సిఫార్సు చేసినట్లు లోక్‌సభ బులెటిన్ వెల్లడించింది. ఈ నెల 30 నుంచి ప్రారంభమయ్యే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం డీలిమిటేషన్ బిల్లును ప్రవేశపెట్టే అవకాశం ఉంది. మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించే ప్రక్రియకు ఈ బిల్లులు మార్గం సుగమం చేయనున్నాయని భావిస్తున్నారు. డిసెంబర్ 2న మహిళా రిజర్వేషన్లకు సంబంధించిన బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టే అవకాశమున్నట్లు సమాచారం. ప్రత్యేక సమావేశాల నిర్వహణపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు తోసిపుచ్చారు. పార్లమెంట్‌ను సమావేశపరచడంలో ప్రభుత్వం ఎలాంటి నిబంధనలను ఉల్లంఘించలేదని స్పష్టం చేశారు. గతంలోనూ పార్లమెంట్ సమావేశాలను నిరవధికంగా వాయిదా వేసిన తర్వాత ప్రోరోగ్ చేయకుండా తిరిగి సమావేశపరిచిన సందర్భాలు ఉన్నాయని గుర్తుచేశారు. ఆగస్టు 13న నిరవధికంగా వాయిదా పడిన వర్షాకాల సమావేశాలను ఇంకా ప్రోరోగ్ చేయలేదని, అందువల్ల ప్రస్తుత సమావేశాలు వాటికి కొనసాగింపుగానే ఉంటాయని వివరించారు. ప్రత్యేక సమావేశాల నేపథ్యంలో ఇప్పటికే ప్రధాన రాజకీయ పార్టీల నేతలతో చర్చించినట్లు రిజిజు తెలిపారు. ప్రభుత్వ నిర్ణయాలతో ఏకీభవించడానికి, విభేదించడానికి ఎంపీలకు పూర్తి స్వేచ్ఛ ఉందని, అయితే పార్లమెంట్ నిబంధనలు, సంప్రదాయాలకు అనుగుణంగా తమ అభిప్రాయాలు వెల్లడించాలని సూచించారు. సభా కార్యకలాపాలకు ఆటంకం కలగకుండా చర్చల్లో పాల్గొని సమావేశాలు సజావుగా సాగేందుకు సహకరించాలని అన్ని పార్టీల ఎంపీలను కోరారు. డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ల అంశాలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్న నేపథ్యంలో ప్రత్యేక సమావేశాలపై ఆసక్తి నెలకొంది. శీతాకాల సమావేశాల నిర్వహణపై కేంద్రం నుంచి ఇంకా స్పష్టత రాలేదు.

ఢిల్లీకి సీఎం రేవంత్‌రెడ్డి

(మొదటి తరువాయి)

కేంద్ర మంత్రివర్గం ఇప్పటికే ఆమోదం తెలిపింది. ఈ ప్రతిపాదన నేపథ్యంలో దక్షిణాది రాష్ట్రాల్లో నెలకొన్న ఆందోళనలు, రాష్ట్రాల రాజకీయ ప్రాతినిధ్యంపై చర్చించేందుకు కాంగ్రెస్ ముఖ్యమంత్రులు సమావేశం కావాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా తెలంగాణ, కేరళ, కర్ణాటక ముఖ్యమంత్రులు ఆదివారం ఢిల్లీలో భేటీ కానున్నారు. డీలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యానికి కలిగే ప్రభావం, మహిళా రిజర్వేషన్ల అమలు తదితర అంశాలపై ఈ సమావేశంలో చర్చించనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

డీలిమిటేషన్ బిల్లును వ్యతిరేకించండి




న్యూఢిల్లీ,

పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న డీలిమిటేషన్ బిల్లును వ్యతిరేకించాలని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) అన్ని రాజకీయ పార్టీలకు, ఎంపీలకు విజ్ఞప్తి చేసింది. ఈ బిల్లు ఆమోదానికి సహకరించే రాజకీయ పార్టీలు, నాయకులు ప్రజల తీర్పుకు ద్రోహం చేసినట్లేనని పేర్కొంది. ఈ మేరకు మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో తన అభిప్రాయాన్ని వెల్లడించింది.లోక్‌సభ, శాసనసభ నియోజకవర్గాల సరిహద్దుల పునర్విభజనలో అధికార పార్టీకి ప్రయోజనం కలిగేలా పక్షపాత మార్పులు జరిగే ప్రమాదం ఉందని సీజేపీ సహ కన్వీనర్ అశుతోష్ రాంకా ఆరోపించారు. బిల్లుకు మద్దతు తెలుపుతున్నవారు దాని అసలు ప్రభావాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. డీలిమిటేషన్ పరిణామాలు వచ్చే లోక్‌సభ ఎన్నికలకే పరిమితం కావని, భవిష్యత్తు రాజకీయాలపైనా ప్రభావం చూపే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు.

ఢిల్లీలో ప్రమాదకర స్థాయికి వాయు కాలుష్యం

న్యూఢిల్లీ,



దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం మరోసారి ప్రమాదకర స్థాయికి చేరుకుంది. శనివారం ఉదయం గాలి నాణ్యత సూచీ (ఏక్యూఐ) 454గా నమోదైంది. ఉదయం 6.51 గంటల సమయానికి ఈ స్థాయికి చేరడంతో నగరవాసులు ఆందోళన చెందుతున్నారు. అర్ధరాత్రి దాటిన తర్వాత కాలుష్య తీవ్రత ఒక్కసారిగా పెరిగి ఏక్యూఐ 400 మార్కును దాటింది. నవంబర్ 21న నమోదైన 449 తర్వాత ఇదే అత్యధిక స్థాయి కావడం గమనార్హం. గాలి నాణ్యత సూచీ 220 నుంచి 226 మధ్య నమోదై పూర్ విభాగంలో కొనసాగింది. అయితే రాత్రికి రాత్రే పరిస్థితి గణనీయంగా దిగజారింది. ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలోని టెర్మినల్-3తో పాటు నగరంలోని పలు ప్రాంతాల్లో కాలుష్య తీవ్రత అధికంగా నమోదైంది. శుక్రవారం సమాచారం అందించిన 57 పర్యవేక్షణ కేంద్రాల్లో 36 కేంద్రాలు పూర్ విభాగంలో ఉండగా, మరో నాలుగు కేంద్రాల్లో వెరీ పూర్ స్థాయి నమోదైంది. తాజా విశ్లేషణల ప్రకారం ఢిల్లీలో సూక్ష్మ ధూళికణాల కాలుష్యానికి వాహనాల నుంచి వెలువడే పొగ ప్రధాన కారణంగా గుర్తించారు. మొత్తం కాలుష్యంలో వాహనాల వాటా 32 శాతంగా ఉంది. బయోమాస్, వ్యర్థాలను కాల్చడం వల్ల మరో 22.8 శాతం కాలుష్యం వెలువడుతోంది. మరోవైపు గాలి వేగం తగ్గడంతో కాలుష్య కారకాలు వాతావరణంలో కలిసిపోకుండా అక్కడే పేరుకుపోతున్నాయి. ప్రతికూల వాతావరణ పరిస్థితులు సమస్యను మరింత తీవ్రతరం చేస్తున్నాయి. భారత వాతావరణ శాఖ అంచనా ప్రకారం వారాంతంలోనూ గాలి నాణ్యత పూర్ విభాగంలోనే కొనసాగనుంది. ఆ తర్వాత పరిస్థితి మరింత దిగజారి వెరీ పూర్ స్థాయికి చేరే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో పిల్లలు, వృద్ధులు, శ్వాసకోశ సమస్యలతో బాధపడేవారు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లకుండా, వీలైనంత వరకు ఇంట్లోనే ఉండాలని హెచ్చరిస్తున్నారు

చంద్రబాబు, జగన్ తక్షణమే గళమెత్తాలి

- ఢిల్లీ నుంచి రాహుల్ గాంధీ పిలుపు
- లోక్‌సభ స్థానాలను 850కి పెంచే యోచనపై రాహుల్ గాంధీ అభ్యంతరం
- మహిళా రిజర్వేషన్ల అమలుకు ప్రస్తుతమున్న 543 స్థానాలే సరిపోతాయన్న ప్రకటన
- తాజా కులగణన ఆధారంగానే నియోజకవర్గాల ప్రక్రియ చేపట్టాలన్న డిమాండ్
- రాజ్యాంగ విలువల రక్షణకు ముందుకు రావాలని చంద్రబాబు, జగన్‌లకు విజ్ఞప్తి
- దేశ ప్రజాస్వామ్య భవిష్యత్తు కోసం యువత గళం విప్పాలని రాహుల్ పిలుపు



న్యూఢిల్లీ

దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థలను కాపాడుకోవాల్సిన సమయం ఆసన్నమైందని, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, వైసీపీ అధినేత జగన్ తక్షణమే స్పందించి గళమెత్తాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. ఢిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని చూస్తున్న డీలిమిటేషన్ విధానాలు ప్రజాస్వామ్య మనుగడకే ముప్పుగా మారుతున్నాయని ఆరోపించారు. కేంద్రంలోని ఎన్డీయే కూటమిలో ఉన్నవారైనా, బయట ఉన్నవారైనా దేశ భవిష్యత్తు కోసం కళ్లు తెరవాలని, చంద్రబాబు, జగన్ వంటి నేతలు రాజ్యాంగ రక్షణ కోసం ముందడుగు వేయాలని ఆయన కోరారు. రాహుల్ గాంధీ తన ప్రసంగంలో లోక్‌సభ స్థానాల సంఖ్యను 543 నుంచి ఏకంగా 850కి పెంచాలనే ప్రతిపాదనను తీవ్రంగా తప్పుపట్టారు. మహిళా రిజర్వేషన్ల పేరుతో కేంద్ర ప్రభుత్వం ఈ ఎత్తుగడను తెరపైకి తెస్తోందని విమర్శించారు. మహిళా రిజర్వేషన్ బిల్లు ఇప్పటికే పార్లమెంటు ఆమోదం పొందిందని, ప్రస్తుతమున్న 543 స్థానాల్లోనే దానిని తక్షణమే అమలు చేయవచ్చని ఆయన స్పష్టం చేశారు. అలాంటప్పుడు సీట్లను 850కి పెంచాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. ఈ 850 సంఖ్య భారత ప్రజాస్వామ్య పునాదులను దెబ్బతీసే చర్య అని ఆయన ఆరోపించారు. ఎన్నికల నియోజకవర్గాల సరిహద్దులను తమకు అనుకూలంగా మార్చుకునేందుకే బీజేపీ ఈ కొత్త మార్గాన్ని ఎంచుకుందని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఒక చిత్రకారుడి చేతికి ఖాళీ కాన్వాస్ ఇస్తే నచ్చిన బొమ్మ గీసుకున్నట్లుగా, బీజేపీకి 850 సీట్లతో మొత్తం దేశ ఎన్నికల మ్యాప్‌ను ఇష్టానుసారంగా మార్చే వెసులుబాటు లభిస్తుందని అన్నారు. తమకు వ్యతిరేకంగా ఉన్న ఓటర్లు, వర్గాలను బలహీనపరిచేందుకు, విపక్ష నాయకులను రాజకీయంగా దెబ్బతీసేందుకు ఈ సరిహద్దుల మార్పును వాడుకుంటారని ఆయన హెచ్చరించారు. ఈ సందర్భంగా అసోం, జమ్మూకశ్మీర్‌లలో జరిగిన పునర్విభజన ప్రక్రియలను రాహుల్ గాంధీ ఉదాహరణగా ప్రస్తావించారు. అక్కడ అనుసరించిన 'ప్యాక్ అండ్ క్రాక్' వ్యూహాన్ని ఇప్పుడు దేశవ్యాప్తంగా అమలు చేయాలని చూస్తున్నారని విమర్శించారు. ఒకే నియోజకవర్గంలోని లక్షలాది మంది ఓటర్లను మరో చోటికి మార్చడం, భౌగోళిక సంబంధం లేని ప్రాంతాలను కలిపి సరిహద్దులను విడగొట్టడం వంటి పద్ధతులను అసోంలో బీజేపీకి లబ్ధి చేకూరేలా చేశారని ఆరోపించారు. ఇదే తరహా విధానాన్ని మొత్తం దేశానికి విస్తరిస్తే ఎన్నికలు జరగకముందే ఫలితాలు ఒకవైపు మొగ్గే పరిస్థితి వస్తుందని ఆయన వ్యాఖ్యానించారు. డీలిమిటేషన్ కమిషన్ స్వరూపంపై కూడా రాహుల్ గాంధీ తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పటికే పక్షపాతంగా వ్యవహరిస్తోందని, ఇప్పుడు ప్రతిపాదిత కమిషన్‌లో ప్రభుత్వ నామినీలు, ప్రధాన ఎన్నికల కమిషనర్ ప్రభావమే ఎక్కువగా ఉండేలా నిబంధనలు తెస్తున్నారని ఆరోపించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించిన రాహుల్, ఆయన నేతృత్వంలో నిష్పాక్షిక పునర్విభజన సాధ్యం కాదని అన్నారు. ఈ కమిషన్ తీసుకునే నిర్ణయాలను న్యాయస్థానాల్లో సవాలు చేసే అవకాశం లేకుండా చేయడం రాజ్యాంగ విరుద్ధమని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ నిష్పాక్షికమైన, అన్ని పార్టీల ప్రతినిధులతో కూడిన స్వతంత్ర కమిషన్‌ను డిమాండ్ చేస్తోందని తెలిపారు. సామాజిక న్యాయం అంశాన్ని ప్రస్తావిస్తూ, తాజా జనాభా లెక్కలు, కుల గణనను పరిగణనలోకి తీసుకోకుండా 2011 జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన చేయాలని చూడటం అన్యాయమని రాహుల్ గాంధీ అన్నారు. ఓబీసీలు, దళితులు, గిరిజనులు, మైనార్టీల ప్రాతినిధ్యాన్ని అణచివేసేందుకే కుల గణన నివేదికలను పక్కన పెడుతున్నారని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వ్‌డ్ స్థానాల సంఖ్యను వచ్చే 40 ఏళ్లపాటు పెరగకుండా స్తంభింపజేయడం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలకు గొడ్డలిపెట్టు అని ఆయన మండిపడ్డారు.

ఎట్టకేలకు తిరుప్పరంకుండ్రం దీపత్తూన్ వద్ద వెలిగిన కార్తీక దీపం

న్యూఢిల్లీ



తమిళనాడులోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం తిరుప్పరంకుండ్రం కొండపై ఉన్న ప్రాచీన రాతి స్తంభం (దీపత్తూన్) పై శనివారం సాయంత్రం కార్తీక దీపాన్ని శాస్త్రోక్తంగా వెలిగించారు. సుప్రీంకోర్టు జారీ చేసిన స్పష్టమైన ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం జరిగింది. శనివారం సాయంత్రం 5 గంటలకు ఆలయ అర్చకులు దీపోత్సవాన్ని నిర్వహించారు. కొండపై ఉన్న మండపం వద్ద అప్పటికే వెలుగుతున్న దీపం నుంచి పవిత్ర జ్యోతిని రాతి స్తంభం వద్దకు తీసుకువచ్చారు. సుమారు 30 కిలోల నెయ్యి, 50 మీటర్ల వత్తి, 5 కిలోల కర్పూరాన్ని ఉపయోగించి ఈ ప్రాచీన స్తంభంపై దీపాన్ని వెలిగించారు. ఈ కార్యక్రమానికి రిటైర్డ్ న్యాయమూర్తులు జస్టిస్ వైద్యనాథన్, జస్టిస్ పార్థిబన్, జిల్లా కలెక్టర్ నిషాంత్ కృష్ణతో పాటు పలువురు ఉన్నతాధికారులు హాజరయ్యారు. సీఆర్‌పీఎఫ్ బలగాల పహారా నడుమ ఈ ప్రక్రియను పూర్తి చేశారు. కొండ దిగువన పెద్ద సంఖ్యలో భక్తులు, స్థానికులు వేచి ఉన్నప్పటికీ, శాంతిభద్రతల దృష్ట్యా కొండపైకి కేవలం 50 మంది భక్తులను మాత్రమే అనుమతించారు. అంతేకాకుండా, కొండపై ఉన్న సికందర్ దర్గా చుట్టూ 50 మీటర్ల పరిధిని బఫర్ జోన్‌గా ప్రకటించి కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

వివాదం నేపథ్యం:

సాధారణంగా ఏటా తిరుప్పరంకుండ్రం సుబ్రహ్మణ్య స్వామి ప్రధాన ఆలయానికి సరిగ్గా పైన ఉండే ఉచ్చిపిళ్లైయార్ ఆలయ సమీపంలోని దీప మండపంపై కార్తీక మహాదీపాన్ని వెలిగించడం సంప్రదాయంగా వస్తోంది. అయితే, అదే కొండపై సికందర్ దర్గాకు సమీపంలో ఉన్న పాత రాతి స్తంభంపై కూడా దీపం వెలిగించాలనే డిమాండ్‌పై గత కొన్నేళ్లుగా వివాదం నడుస్తోంది. గతేడాది మద్రాస్ హైకోర్టు మదురై బెంచ్ ఆ రాతి స్తంభంపై దీపం వెలిగించాలని ఆదేశించినప్పటికీ, అధికారులు దానిని అమలు చేయలేదు. దీంతో ఈ వివాదం సుప్రీంకోర్టుకు చేరింది. ఈ ఏడాది నవంబర్ 20న సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేస్తూ, రాతి స్తంభంపై దీపం వెలిగించేందుకు అనుమతి ఇచ్చింది. అయితే, కార్తీక పౌర్ణమి నాడు కేవలం ఆలయ మండపంపైనే దీపాన్ని వెలిగించి, రాతి స్తంభంపై వెలిగించకపోవడంతో కోర్టు ధిక్కార పిటిషన్ దాఖలైంది. దీనిపై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు, తమ ఆదేశాలను కావాలనే ఉల్లంఘించారని తమిళనాడు ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ వ్యవహారాన్ని కోర్టు ధిక్కారంగా పరిగణిస్తూ, శనివారం నాటికి రాతి స్తంభంపై తప్పనిసరిగా దీపం వెలిగించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలను అనుసరిస్తూ తమిళనాడు అధికారులు చర్యలు చేపట్టడంతో, కొండపై దీపారాధన ప్రశాంతంగా ముగిసింది.

డీలిమిటేషన్‌కు మేం సై

- కేంద్రం ప్రతిపాదనను స్వాగతిస్తున్నాం
- తెలంగాణ ప్రయోజనాలే మాకు ముఖ్యం
- తెలంగాణ లోక్‌సభ స్థానాలు 17 నుంచి 26కు పెంపు
- దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యానికి భద్రత కల్పించాలి
- అనుకూలంగా ఓటు వేయనున్న ముగ్గురు రాజ్యసభ సభ్యులు
- ఎక్స్ వేదికగా వెల్లడించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



తెలంగాణ బ్యూరో

నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ బిల్లులకు బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ నెల 30 నుంచి ప్రారంభం కానున్న ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న ప్రతిపాదనలను స్వాగతిస్తున్నట్లు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెల్లడించారు. దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యానికి భద్రత కల్పిస్తూ తెలంగాణ లోక్‌సభ స్థానాలను ప్రస్తుతమున్న 17 నుంచి 26కు పెంచేలా కేంద్రం ప్రతిపాదించిన ముసాయిదాకు తమ పార్టీ అనుకూలంగా ఉందని స్పష్టం చేశారు. డీలిమిటేషన్‌పై బీఆర్ఎస్ వైఖరి మొదటి నుంచీ స్పష్టంగానే ఉందని కేటీఆర్ పేర్కొన్నారు. పార్లమెంట్‌లో దక్షిణ భారతదేశానికి ప్రస్తుతం ఉన్న 24 శాతం ప్రాతినిధ్యాన్ని కాపాడాలని తమ పార్టీ నిరంతరం డిమాండ్ చేస్తోందని తెలిపారు. 2051 వరకు రాష్ట్రాల మధ్య ప్రస్తుత దామాషా నిష్పత్తిలో మార్పు లేకుండా భద్రత కల్పిస్తూ, అన్ని రాష్ట్రాల్లో 50 శాతం సీట్లు పెంచాలన్న ప్రతిపాదన దక్షిణాది రాష్ట్రాల ఆందోళనలకు పరిష్కారం చూపుతుందని అభిప్రాయపడ్డారు. దీనివల్ల తెలంగాణకు అదనంగా తొమ్మిది లోక్‌సభ స్థానాలు లభించే అవకాశం ఉందని పేర్కొన్నారు. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలన్న అంశానికి బీఆర్ఎస్ ఎప్పటినుంచో మద్దతు ఇస్తోందని కేటీఆర్ గుర్తుచేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లును తక్షణమే అమలు చేయాలన్నదే తమ పార్టీ వైఖరని పునరుద్ఘాటించారు. తెలంగాణ ప్రయోజనాలకు ప్రాధాన్యమిస్తూ, దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగని విధంగా రూపొందించిన ప్రతిపాదనకు రాజ్యసభలోని తమ పార్టీ ముగ్గురు సభ్యులు అనుకూలంగా ఓటు వేస్తారని తెలిపారు. ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, దీవకొండ దామోదర్‌రావు, బండి పార్థసారథిరెడ్డిలు బిల్లుకు మద్దతు ఇవ్వనున్నట్లు కేటీఆర్ ఎక్స్ వేదికగా వెల్లడించారు.

కేంద్ర డీలిమిటేషన్ బిల్లుకు డీఎంకే గ్రీన్ సిగ్నల్..

న్యూఢిల్లీ,

కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన సవరించిన నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) బిల్లుకు ద్రవిడ మున్నేట్ర కజగం (డీఎంకే) మద్దతు ఇచ్చేందుకు అంగీకరించింది. పార్టీ అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ ప్రతిపాదించిన ప్రధాన డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుందని పార్టీ ఉన్నత స్థాయి వర్గాలు వెల్లడించాయి. "మా నాయకుడు పట్టుబట్టిన అంశాలను కేంద్రం ఆమోదించింది.. అందుకే బిల్లుకు మద్దతు ఇచ్చేందుకు అంగీకరిస్తున్నాం" అని సీనియర్ నేతలు స్పష్టం చేశారు. పార్లమెంట్‌లో రాజ్యాంగ సవరణ బిల్లును ఆమోదింపజేసేందుకు కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వానికి మూడింట రెండొంతుల మెజారిటీ అవసరం. లోక్‌సభలో 22 మంది ఎంపీలు ఉన్న డీఎంకే వైఖరి ఈ ఓటింగ్‌లో అత్యంత కీలకంగా మారింది. లోక్‌సభలో స్థానాలను 50 శాతం పెంచినప్పటికీ తమిళనాడుకు ప్రస్తుతం ఉన్న 7.18 శాతం ప్రాతినిధ్య వాటా తగ్గకూడదని స్టాలిన్ గతంలోనే డిమాండ్ చేశారు. అలాగే 1971 జనాభా లెక్కల ఆధారంగా ఉన్న సీట్ల విభజనను మరో 25 ఏళ్ల పాటు యథాతథంగా కొనసాగించాలని కోరారు. సవరించిన ప్రతిపాదనలో రాష్ట్రాల నిష్పత్తి వాటా మారకుండా అందరికీ సమానంగా 50 శాతం సీట్లు పెంచేందుకు కేంద్రం సిద్ధపడటంతో డీఎంకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రతిపాదనకు మద్దతు ఇవ్వకపోతే జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్ చేపట్టాల్సి వస్తుందని, సాధారణ మెజారిటీతోనే దాన్ని అమలు చేసే అవకాశం ఉందని బీజేపీ డీఎంకేకు స్పష్టం చేసినట్లు సమాచారం. ఇదిలా ఉండగా, తమిళనాడులోని అధికార తమిళగ వెట్రి కళగం (టీవీకే) డీఎంకే తీరును తీవ్రంగా తప్పుబట్టింది.

తెలంగాణలో ఐపీఎస్ అధికారుల బదిలీలు

(మొదటి తరువాయి)

కమిషనర్ బాధ్యతల నుంచి తప్పించి, మెట్రోపాలిటన్ ఏరియా అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ కార్యదర్శిగా నియమించారు. జీహెచ్ఎంసీతో పాటు సైబరాబాద్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్లకు ప్రత్యేక అధికారిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. 2017 బ్యాచ్ ఐపీఎస్ అధికారి ఈవీ నరసింహారెడ్డిని హెచ్ఎండీఏ మెట్రోపాలిటన్ కమిషనర్‌గా నియమించారు. ఆయన మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా కూడా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహించనున్నారు. ఇన్వెస్ట్ తెలంగాణ ముఖ్య కార్యనిర్వహణాధికారిగా ఉన్న బి. అజిత్ రెడ్డికి హైదరాబాద్ మెట్రో రైల్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ బాధ్యతల నుంచి సర్ఫరాజ్ అహ్మద్‌ను రిలీవ్ చేశారు. హైదరాబాద్ జలమండలి సంయుక్త మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్న మయాంక్ మిట్టల్‌కు జీహెచ్ఎంసీ శంషాబాద్ జోనల్ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు కేటాయించారు. ఇప్పటివరకు ఆ బాధ్యతలు నిర్వహించిన కె. చంద్రకళను హెచ్ఎండీఏ జాయింట్ మెట్రోపాలిటన్ కమిషనర్‌గా బదిలీ చేశారు. కోర్ అర్బన్ రీజియన్, భూసమీకరణ, మెట్రో రైల్ వ్యవహారాలను ఆమె పర్యవేక్షించనున్నారు. హైదరాబాద్ గ్రోత్ కారిడార్ సంస్థ ప్రత్యేక కలెక్టర్ (భూసేకరణ) బాధ్యతలూ అప్పగించారు. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి సబ్ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఐపీఎస్ అధికారి మనోజ్‌ను హైదరాబాద్ మెట్రో రైల్ సంస్థ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమించారు. వరంగల్ ప్రాంతీయ ఉపసంచాలకుడు (రాష్ట్ర ఆడిట్)గా ఉన్న పి. రామును పాఠశాల విద్యాశాఖ ప్రత్యేక అధికారి (ప్రాజెక్టులు)గా బదిలీ చేశారు. ఆ బాధ్యతల్లో ఉన్న వి. శ్రీనివాస్ రెడ్డిని రిలీవ్ చేసి, మాతృశాఖకు నివేదించాల్సిందిగా ఆదేశించారు. నగరాభివృద్ధి ప్రాజెక్టుల నిర్వహణ, వివిధ సంస్థల మధ్య సమన్వయం, పరిపాలనా వ్యవహారాలను వేగవంతం చేసే లక్ష్యంతో ఈ మార్పులు చేపట్టినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. బదిలీ ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వస్తాయని ప్రభుత్వం స్పష్టం చేసింది.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

పట్టపగలు ఇంట్లోకి చొరబడి...మహిళలను కట్టేసి 3.20 కోట్లు దోచుకెళ్లిన దుండగులు..





జర్నలిస్టు డైరీ,ఎల్బీనగర్:

పట్టపగలే దోపిడీ దొంగలు ఇంట్లోకి చొరబడి అక్కడ ఉన్న మహిళలను కట్టేసి ఇంట్లో ఉన్న రూ. 3.20 కోట్లు నగదును దోచుకెళ్లిన సంఘటన ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం తీవ్ర కలకలం రేపింది. ఎల్బీనగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మాన్‌సూరాబాద్‌లోని చందేశ్వర్ కాలనీ, రోడ్ నంబర్ 2, ప్లాట్ నంబర్ 61లో నివాసం ఉంటున్న సామ మానమ్మ (65) ఇంట్లో ఈ దోపిడీ జరిగింది. ఆస్ట్రేలియాలో నివాసం ఉంటున్న కొమ్మరవెల్లి సంపత్ కుమార్ రెడ్డి భారతదేశంలో స్థిరాస్తి కొనుగోలు కోసం రూ. 3.20 కోట్లను బ్యాంకు ఖాతా ద్వారా తన బావ కుంభం విజయ్ కుమార్ రెడ్డికి పంపించాడు. ఆయన ఆ నగదుగా మార్చుకున్నాడు. ఈ చెల్లించే నవంబర్ 22న రూ. 3.30 కోట్లు నగదు నగదు బ్యాంక్ నుండి మానమ్మ కుటుంబానికి చెందిన నమా ప్రవీణ్ ఇంట్లో భద్రపరిచాడు. కుటుంబ సభ్యులు వివాహానికి వెళ్లాల్సి ఉండటంతో నగదును అక్కడ ఉంచినట్లు సమాచారం. శనివారం మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో ముసుగులు పరచిన నలుగురు దుండగులు ఇంట్లోకి ప్రవేశించారు. ఆ సమయంలో ఇంట్లో ఉన్న మానమ్మ. ఆమె కోడలు మౌనిక చేతులను కట్టేసి, నోళ్లకు ప్లాస్టర్ వేసి అరవకుండా చేశారు. అనంతరం బెడ్రూమ్‌లోని బీరువాను బలవంతంగా





పగలగొట్టి అందులో ఉన్న రూ. 3.30 కోట్ల నగదును ఎత్తుకెళ్లారు. ఇంట్లో ఉన్న మహజలు కేకలు వేడయంతో చుట్టుపక్కల వారు అప్రమత్తమై పోలీసులకు సమాచారం అందించారు. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇంటి పరిసరాల్లోని సీసీ టీవీ ఫుటేజీలను ఎల్బీనగర్ పోలీస్ సేకరించి విశ్లేషిస్తున్నారు. దుండగులను గుర్తించడంతో పాటు వారు పారిపోయిన మార్గాన్ని తెలుసుకునేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. క్లూస్ టీమ్. డాగ్ స్క్వాడ్తో ఆధారాలు సేకరిస్తున్నారు. ఇంట్లో అంత పెద్ద మొత్తంలో నగదు ఉన్న విషయం తెలిసిన వారే ఈ దోపిడీకి పాల్పడి ఉంటారా..? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ సమాచారం అందుకుంది ఎల్ బీనగర్ పోలీస్లు క్రైమ్ సిబ్బంది సంఘటన స్థలానికి ఎల్బీనగర్ ఏసీపీ రవీందర్రెడ్డి. ఎల్బీనగర్ సీఐ వెంకటేశం, ఇతర పోలీసులు పరిశీలించారు. పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు.

నరసింహులు మృతికి బాధ్యత ఎవరిది?

- షాద్‌నగర్ చౌరస్తా విస్తరణపై అధికారుల నిర్లక్ష్యమెందుకు?

- చౌరస్తా విస్తరణ ఉద్యమ నాయకుడు ఆర్.ఎన్. రాము

కలెక్టర్ ఆదేశించినా కదలని మున్సిపల్ యంత్రాంగం

ఆక్రమణలు తొలగించకుండా ప్రజల ప్రాణాలతో చెలగాటమా?



రంగారెడ్డి జిల్లా బ్యూరో, నవంబర్ 28 (జర్నలిస్ట్ డైరీ):

షాద్‌నగర్ చౌరస్తాలో వరుస ప్రమాదాలు జరుగుతున్నా మున్సిపల్ అధికారులు ఎందుకు స్పందించడం లేదని చౌరస్తా విస్తరణ ఉద్యమ నాయకుడు ఆర్.ఎన్. రాము ప్రశ్నించారు. నవంబర్ 26వ తేదీ సాయంత్రం 6.15 గంటల సమయంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో పెంజర్ల గ్రామానికి చెందిన నరసింహులు తీవ్రంగా గాయపడి శుక్రవారం మృతి చెందడం తీవ్ర ఆవేదన కలిగించిందన్నారు. ఈ మరణం చౌరస్తా విస్తరణపై అధికారుల నిర్లక్ష్యాన్ని మరోసారి ఎత్తిచూపుతోందని విమర్శించారు. గత ఏడాది కాలంగా షాద్‌నగర్ చౌరస్తా విస్తరణ చేస్తామని చెబుతూ కాలయాపన చేస్తున్నారని, మాటలు తప్ప చేతల్లో పనులు కనిపించడం లేదని రాము మండిపడ్డారు. చౌరస్తా పరిధిలో ఆక్రమణలు ఉన్నాయని రహదారులు, భవనాల శాఖ అధికారులు చెబుతున్నప్పటికీ వాటిని తొలగించేందుకు మున్సిపల్ యంత్రాంగం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. ఆక్రమణల తొలగింపులో మున్సిపల్ అధికారులు మీనమేషాలు లెక్కించడం వెనుక కారణాలేమిటని ప్రశ్నించారు. జిల్లా కలెక్టర్ ఫిబ్రవరి, అక్టోబర్ నెలల్లో చౌరస్తా విస్తరణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ఆక్రమణలు తొలగించాలని ఆదేశించినప్పటికీ ఇప్పటివరకు పనులు ఎందుకు ప్రారంభించలేదని ప్రశ్నించారు. కలెక్టర్ ఆదేశాలకే విలువ లేకుండా పోయిందా? లేక మున్సిపల్ అధికారులు ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేస్తున్నారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. చౌరస్తా విస్తరణలో జాప్యానికి మున్సిపల్ కమిషనర్, పట్టణ ప్రణాళిక అధికారి పావని, మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బసవేశ్వర్ నైతిక బాధ్యత వహించాలని ఆర్.ఎన్. రాము డిమాండ్ చేశారు. ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన చౌరస్తా సమస్యను పరిష్కరించకుండా ఇంకా ఎంతకాలం నిర్లక్ష్యం చేస్తారని ప్రశ్నించారు.

ఒక నరసింహులు ప్రాణం పోయిన తర్వాత అధికారులు మేల్కొంటారా? మరో కుటుంబం రోడ్డున పడిన తర్వాతే చౌరస్తా విస్తరణ చేపడతారా? ప్రజల ప్రాణాల కంటే ఆక్రమణలే ముఖ్యమా? అని నిలదీశారు. నరసింహులు మృతికి దారితీసిన ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపించాలని, చౌరస్తా విస్తరణకు తక్షణమే చర్యలు చేపట్టాలని, ఆక్రమణలు తొలగించి శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. ఇకనైనా అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి చౌరస్తా విస్తరణ చేపట్టాలి. ప్రజల ప్రాణాలను కాపాడాల్సిన బాధ్యత పాలకులు, అధికారులపై ఉంది. మరో ప్రాణం బలికాకముందే చర్యలు తీసుకోవాలని ఆర్.ఎన్. రాము డిమాండ్ చేశారు.

ఇందిరా మహిళా శక్తి మహిళలకు 7,400 యూనిఫామ్ చీరలు రాక

నందిగామ మండల సమాఖ్య కార్యాలయానికి చేరిన చీరలు

రంగారెడ్డి జిల్లా బ్యూరో, నవంబర్ 28 (జర్నలిస్ట్ డైరీ) :

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా మహిళా సంఘాల సభ్యులకు పంపిణీ చేయనున్న యూనిఫామ్ చీరలు నందిగామ మండలానికి చేరుకున్నాయి. మొయినాబాద్ గోదాం నుంచి మొత్తం 7,400 చీరలను నందిగామ మండల సమాఖ్య కార్యాలయానికి తీసుకువచ్చారు.ఈ సందర్భంగా ఏపీఎం భగవంతు, సమాఖ్య అధ్యక్షురాలు అపరంజిని, సీసీలు, సమాఖ్య అకౌంటెంట్ తదితరులు పాల్గొన్నారు. మహిళా సంఘాల సభ్యులకు ప్రభుత్వం అందిస్తున్న ఈ యూనిఫామ్ చీరలు మహిళల్లో ఐక్యత, సంఘటిత భావాన్ని పెంపొందించడంతో పాటు ఇందిరా మహిళా శక్తి కార్యక్రమానికి మరింత గుర్తింపు తీసుకురానున్నాయి.



56వ రోజు నిరవధిక రిలే నిరాహార దీక్షకు బైర్కాన్‌పల్లి, సిద్దాపూర్ గ్రామస్థుల సంఘీభావం



రంగారెడ్డి జిల్లా బ్యూరో, నవంబర్ 28 (జర్నలిస్ట్ డైరీ) :

సిద్దాపూర్ గ్రామ పరిధిలో ప్రతిపాదించిన డంపింగ్ యార్డ్ / ఎకో టౌన్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ, GO Rt. No. 641 ఉపసంహరించాలనే ప్రధాన డిమాండ్‌తో జేఏసి ఆధ్వర్యంలో కొనసాగుతున్న నిరవధిక రిలే నిరాహార దీక్ష 56వ రోజుకు చేరుకుంది.56వ రోజు దీక్షా శిబిరంలో బైర్కాన్‌పల్లి, సిద్దాపూర్ గ్రామాలకు చెందిన పలువురు గ్రామస్థులు పాల్గొని ఉద్యమానికి తమ సంఘీభావాన్ని ప్రకటించారు.ఈ సందర్భంగా యాదగిరి రావు, వెంకటేష్ యాదవ్, బాబు యాదవ్, వడ్డే బాలయ్య, రాజప్ప, శ్రీధర్, రాజేందర్ రెడ్డి, వడ్డే మహేష్, నజీర్, మున్యా నాయక్, యాతం సత్తమ్మ, ఎర్రోళ్ల మల్లయ్య తదితరులు దీక్షలో పాల్గొన్నారు.సిద్దాపూర్ సమస్య కేవలం ఒక గ్రామానికి సంబంధించినది కాదని, పరిసర ప్రాంతాల ప్రజల భవిష్యత్తు, పర్యావరణం, వ్యవసాయం, ప్రజల జీవనోపాధికి సంబంధించిన అంశమని ఉద్యమకారులు పేర్కొన్నారు. ప్రజల ఆందోళనలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని GO Rt. No. 641ను ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు.56 రోజులుగా కొనసాగుతున్న ఈ ప్రజా పోరాటానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి లభిస్తున్న మద్దతు ఉద్యమానికి మరింత బలాన్ని చేకూరుస్తోంది.

మంచిర్యాల జిల్లాలో జోరుగా టీఎన్జీవో సభ్యత్వ నమోదు

- 189 మంది ఉద్యోగుల సభ్యత్వం







ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ డైరీ)

టీఎన్జీవో మంచిర్యాల జిల్లా అధ్యక్షులు గడియారం శ్రీహరి ఆధ్వర్యంలో జిల్లాలో టీఎన్జీవో సభ్యత్వ నమోదు కార్యక్రమం జోరుగా సాగుతోంది.

మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ లో 104 మంది, జిల్లా ట్రెజరీ మరియు పే అండ్ అకౌంట్స్ కార్యాలయంలో 30 మంది, ప్రభుత్వ నర్సింగ్ కాలేజీలో 15 మంది, జైపూర్ మండలంలో రెవెన్యూ, పంచాయతీ రాజ్, అగ్రికల్చర్ తదితర శాఖల్లో 40 మంది నాన్ గెజిటెడ్ ఉద్యోగులు సభ్యత్వం తీసుకున్నారు. మొత్తం 189 మంది ఉద్యోగులు టీఎన్జీవోలో చేరారు.

ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు శ్రీహరి మాట్లాడుతూ, ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో టీఎన్జీవో సంఘం ఎల్లవేళలా కృషి చేస్తుందని, జిల్లాలో సభ్యత్వ నమోదు చివరి దశలో ఉందని, అతి త్వరలోనే దాన్ని పూర్తి చేసి రాష్ట్రంలోనే మంచిర్యాల జిల్లాను మొదటి స్థానంలో నిలపాలని, రాష్ట్రంలోనే ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దాలని అన్నారు.ఈ కార్యక్రమాల్లో జిల్లా కార్యదర్శి బొడ్డు శ్రావణ్, కేంద్ర సంఘం కార్యదర్శి పొన్న మల్లయ్య, అసోసియేట్ అధ్యక్షులు శ్రీపతి బాపురావు, ఉపాధ్యక్షులు జాడి రామ్ కుమార్, తంగళ్ళపల్లి తిరుపతి, పద్మలత, సంయుక్త కార్యదర్శి సునీత, ప్రచార కార్యదర్శి యూసుఫ్, మంచిర్యాల యూనిట్ అధ్యక్షులు నాగుల గోపాల్, కార్యదర్శి అజయ్, మందమర్రి యూనిట్ ఉపాధ్యక్షులు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ బీమా భరోసా: నాగవర్ధన



జర్నలిస్ట్ డైరీ పరిగి, నవంబర్ 28:

పరిగి మండలం రాపోలు గ్రామ రైతు వేదికలో శనివారం ‘ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా’ పథకాన్ని పిఎసిఎస్ డైరెక్టర్, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగవర్ధన్ ప్రారంభించారు.గతంలో భూమి ఉన్నవారికే పరిమితమైన బీమా సౌకర్యాన్ని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి వర్తింపజేశారని ఆయన తెలిపారు. కుటుంబ యజమాని అకాల మరణం చెందితే రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందుతుందన్నారు. పదేళ్లలో జరగని అభివృద్ధిని కాంగ్రెస్ ప్రభుత్వం మూడేళ్లలోనే చేసి చూపిస్తోందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి వార్డు సభ్యులు రాజేష్, రాజు, రఫీ, వెంకటేశ్ పాల్గొన్నారు.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

ముగ్గురు చిన్నారుల మృతదేహాలను చూసి చలించిపోయిన మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

ఒకే కుటుంబంలో మూడు పసిప్రాణాలు బలికావడం హృదయవిదారకం

బాధిత కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పిన బీఆర్ఎస్ నేతలు

షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో బాధితులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



రంగారెడ్డి జిల్లా బ్యూరో, నవంబర్ 28 (జర్నలిస్ట్ డైరీ) :
కన్నవారి కళ్ల ముందే పెరగాల్సిన పసిపిల్లలు.. కాటికి చేరిన విషాదాన్ని చూసి మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ చలించిపోయారు. అభం శుభం తెలియని ముగ్గురు చిన్నారులు ఒకే ఘటనలో ప్రాణాలు కోల్పోవడం తన హృదయాన్ని కలచివేసిందని ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి దుర్భర పరిస్థితి ఏ కుటుంబానికీ రాకూడదని కన్నీటి పర్యంతమయ్యారు. కేశంపేట మండలం తొమ్మిదిరేకుల గ్రామంలో ముగ్గురు చిన్నారులు నీటి సంపులో పడి మృతి చెందిన హృదయవిదారక ఘటన నేపథ్యంలో షాద్‌నగర్ ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రానికి భారత రాష్ట్ర సమితి షాద్‌నగర్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్ తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలు చేరుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మార్చురీలో ఉంచిన చిన్నారుల మృతదేహాలను మాజీ ఎమ్మెల్యే సందర్శించి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి జరిగిన ఘటనపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అంజయ్య యాదవ్ మాట్లాడుతూ.. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు చిన్నారులు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమన్నారు. బంగారం లాంటి కుటుంబాలు క్షణికావేశం, మానసిక ఒత్తిళ్ల కారణంగా ఛిన్నాభిన్నం కావడం ఆవేదన కలిగిస్తోందన్నారు. మానసిక ఒత్తిడిని తట్టుకోలేక తీసుకునే తొందరపాటు నిర్ణయాలు ఎన్నో కుటుంబాలను రోడ్డున పడేస్తున్నాయని విచారం వ్యక్తం చేశారు.
ముగ్గురు చిన్నారుల మృతితో ఆ కుటుంబం అనుభవిస్తున్న వేదన వర్ణనాతీతమని, ఇలాంటి విషాదం మరే తల్లిదండ్రులకు ఎదురుకాకూడదని అన్నారు. బాధిత కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్‌తో పాటు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని చిన్నారుల మృతిపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

షాద్ నగర్‌లో డిసెంబర్ 1న సదర్ వేడుకలు

సదర్ కమిటీ అధ్యక్షులుగా కేశమోని శ్రీనివాస్ యాదవ్.

పార్టీలకతీతంగా సదర్ వేడుకలను విజయవంతం చేయాలని పిలుపు



రంగారెడ్డి జిల్లా బ్యూరో, నవంబర్ 28 (జర్నలిస్ట్ డైరీ) :
యాదవుల ఆత్మగౌరవం, సంస్కృతి మరియు ఐక్యతకు ప్రతికగా జరుపుకునే సదర్ పండుగను షాద్ నగర్ లో డిసెంబర్ 1వ తేదీన నిర్వహిస్తున్నట్లు అఖిల భారత యాదవ మహాసభ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి నడికుడ రఘునాథ్ యాదవ్ తెలిపారు. షాద్నగర్ పట్టణంలోని ఏబి కాంప్లెక్స్ లో శనివారం అఖిల భారత యాదవ మహాసభ తాలూకా అధ్యక్షుడు మల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో యాదవ సంఘం నాయకులతో కలిసి సదర్ వేదికల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా షాద్నగర్ తాలూకా సదర్ కమిటీ నూతన అధ్యక్షుడిగా నందిగామ కు చెందిన కేశమోని శ్రీనివాస్ యాదవ్(సదర్ శీను) ను ఎన్నుకున్నారు. డిసెంబర్ 1 మంగళవారం రోజు షాద్నగర్ పట్టణంలోని మెయిన్ రోడ్ లో సాయంత్రం 6 గంటలకు సదర్ వేడుకలను నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ సదర్ వేడుకలను రాజకీయ పార్టీలకు అతీతంగా నియోజకవర్గంలోని యాదవులంతా కలిసికట్టుగా ఐకమత్యంతో ఘనంగా నిర్వహించి యాదవుల గొప్పతనాన్ని చాటి చెప్పాలని అన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి యాదవులు అధిక సంఖ్యలో హాజరై సదర్ వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం సదరు కమిటీ అధ్యక్షులుగా నూతనంగా ఎన్నికైన సదర్ శీను ను శాలువా పూలమాలతో యాదవ సంఘం నాయకులు ఘనంగా సన్మానించి శు భాకాంక్షలు తెలిపారు. సదర్ కమిటీ అధ్యక్షులు సదర్ శీను మాట్లాడుతూ తనపై నమ్మకంతో సదర్ కమిటీ అధ్యక్షులుగా ఎన్నుకున్నందుకు యాదవ సంఘం పెద్దలకు నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. అందరితో కలిసికట్టుగా, అందరి సహకారంతో ఈసారి షాద్నగర్లో సదర్ వేడుకలను ఘనంగా నిర్వహిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు ఆలుగడ్డ ప్రవీణ్ యాదవ్, చక్కటి వెంకటేష్ యాదవ్, నడికూడ యాదగిరి యాదవ్, అడివయ్య యాదవ్, పసుల నరసింహ యాదవ్, తుమ్మల నరసింహ యాదవ్, సూరారం శ్రీశైలం యాదవ్, విట్యాల రాముల యాదవ్, పద్మారం వెంకటేష్ యాదవ్, జెకె నరసింహులు, మాధవులు యాదవ్, అనేమోని నర్సింలు యాదవ్, రామకృష్ణ యాదవ్, శ్రీనివాస్ యాదవ్, కిషోర్ యాదవ్, మహేష్ యాదవ్, ఆంజనేయులు యాదవ్, రామచంద్ర యాదవ్, మురళీమోహన్ యాదవ్, రవి యాదవ్, కృష్ణ యాదవ్, అశోక్ యాదవ్, సాయి యాదవ్, రమేష్ యాదవ్, నరేష్ యాదవ్, సంతోష్ యాదవ్, రాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు..

చిన్నారుల ఎదుగుదలకు పోషకాహారం ఎంతో ముఖ్యం - సి డి పి ఓ విష్ణుప్రియ

మంచిర్యాల జిల్లా (జర్నలిస్టు డైరీ) నవంబర్ 28.




చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు పోషకాహారం ఎంతో ముఖ్యమని, చిన్నారుల ఉజ్వల భవిష్యత్తుకు అంగన్‌వాడీ కేంద్రాలు బాటలు వేస్తున్నాయని సిడిపిఓ విష్ణుప్రియ అన్నారు.శనివారం మంచిర్యాల ప్రాజెక్ట్ పరిధిలోని రాంనగర్ సెక్టార్ ముస్లిం బస్తీ-1 అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కమ్యూనిటీ బేస్డ్ ఈవెంట్ కార్యక్రమానికి సూపర్వైజర్ జ్యోతి, సీనియర్ అసిస్టెంట్ స్వరూపలతో కలిసి ఆమె హాజరయ్యారు.ఈ సందర్భంగా సిడిపిఓ మాట్లాడుతూ, చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు పోషకాహారం, ప్రాథమిక విద్య ఎంతో అవసరమని తెలిపారు. ఆరు నెలల వయస్సు పూర్తయిన తర్వాత తల్లిపాలతో పాటు తగిన అనుబంధ ఆహారాన్ని అందించడం ద్వారా చిన్నారుల శారీరక, మానసిక ఎదుగుదలకు దోహదపడుతుందని వివరించారు.
చిన్న వయస్సు నుంచే పిల్లలలో విద్య పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు అక్షరాభ్యాసం ఎంతగానో ఉపయోగపడుతుందని, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారం, ఆరోగ్య సేవలు, ప్రీ-స్కూల్ విద్యా కార్యక్రమాలను గర్భిణులు, బాలింతలు, తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.
అనంతరం చిన్నారులకు సంప్రదాయబద్ధంగా అన్నప్రాసన, అక్షరాభ్యాస కార్యక్రమాలను నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ కాంతకృష్ణ, ఆయా మంజుల, తల్లులు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

సమానత్వ సమాజ నిర్మాణమే పూలేకు నిజమైన నివాళి

-బీసీ జనసేన జాతీయ అధ్యక్షులు కత్తి చంద్రశేఖరప్ప, రాష్ట్ర అధ్యక్షులు పసుపుల ప్రశాంత్

-బహుజనుల హక్కుల సాధనకు ఐక్యంగా ఉద్యమించాలి

-షాద్‌నగర్‌లో మహాత్మా జ్యోతిరావు పూలేకు ఘన నివాళులు



రంగారెడ్డి జిల్లా బ్యూరో, నవంబర్ 28 (జర్నలిస్ట్ డైరీ) :
సమాజంలో అణచివేతకు గురవుతున్న బడుగు, బలహీన వర్గాలకు విద్య, ఆత్మగౌరవం, సమాన హక్కులు కల్పించడమే లక్ష్యంగా జీవితాంతం పోరాడిన మహనీయుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని బీసీ జనసేన నాయకులు అన్నారు. ఆయన వర్ధంతిని పురస్కరించుకుని షాద్‌నగర్ పట్టణంలో పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీసీ జనసేన జాతీయ అధ్యక్షులు కత్తి చంద్రశేఖరప్ప, రాష్ట్ర అధ్యక్షులు పసుపుల ప్రశాంత్, మేకల వెంకటేష్, నల్లమోని శ్రీధర్, చందూలాల్, ప్రవీణ్ రెడ్డి మాట్లాడుతూ సమాజంలో వేళ్లూనుకున్న కులవివక్ష, అంటరానితనం, మూఢనమ్మకాలు, అసమానతలను రూపుమాపేందుకు జ్యోతిరావు పూలే చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. అందరికీ విద్య అందని రోజుల్లో విద్యే సమాజ మార్పునకు అసలైన మార్గమని చాటి, బాలికలు, అణగారిన వర్గాల విద్యాభివృద్ధికి విశేష కృషి చేశారని గుర్తుచేశారు. తన సహచరి సావిత్రీబాయి పూలేను విద్యావంతురాలిగా తీర్చిదిద్ది మహిళా విద్యకు ప్రోత్సాహం అందించడమే కాకుండా, మహిళల హక్కులు, వితంతువుల సంక్షేమం, రైతులు, పేదల అభ్యున్నతి కోసం కూడా విశేషంగా కృషి చేశారని కొనియాడారు. పూలే దంపతులు నాటిన సామాజిక చైతన్య బీజాలు నేటికీ సమాజానికి దిశానిర్దేశం చేస్తున్నాయని నాయకులు అన్నారు. ఆయన ఆశయాలు మాటలకే పరిమితం కాకుండా ఆచరణలోకి రావాలంటే బహుజనులంతా ఐక్యంగా ఉండి విద్య, ఉపాధి, సామాజిక న్యాయం, హక్కుల సాధన కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కుల, మత, వర్గ వివక్షలకు తావులేని సమాజం ఏర్పడినప్పుడే మహాత్మా జ్యోతిరావు పూలేకు నిజమైన నివాళి అర్పించినట్లవుతుందని వారు స్పష్టం చేశారు.

మంథని జేఎన్‌టీయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ నరహరి అజ్మీరాకు డాక్టరేట్

రామగిరి,నవంబర్ 28, (జర్నలిస్ట్ డైరీ) :



మంథని జేఎన్‌టీయూ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.నరహరి అజ్మీరా డాక్టరేట్ పట్టా సాధించారు.కాకతీయ విశ్వవిద్యాలయం 24వ స్నాతకోత్సవంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా ఆయన పీహెచ్‌డీ పట్టాను అందుకున్నారు.కాకతీయ విశ్వవిద్యాలయానికి చెందిన డా. పి. కామాక్షి పర్యవేక్షణలో 'సెంటిమెంట్ అనాలిసిస్ బేస్డ్ ఆన్ ప్రొడక్ట్ రివ్యూస్ యూజింగ్ డీప్ లెర్నింగ్ అప్రోచెస్' అనే అంశంపై ఆయన పరిశోధన చేశారు. వినియోగదారుల అభిప్రాయాలను కృత్రిమ మేధస్సు, డీప్ లెర్నింగ్ సాంకేతికత ద్వారా కచ్చితంగా విశ్లేషించే ఆధునిక విధానాలను ఈ పరిశోధనలో వివరించారు. ఈ సందర్భంగా తనకు సహకరించిన గైడ్, అధ్యాపకులు, కుటుంబ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. డాక్టరేట్ సాధించిన నరహరి అజ్మీరాను సహచర అధ్యాపకులు, మిత్రులు అభినందించారు.

రైతు భరోసాకు ఎగనామం పంట విరామం పేరుతో రైతులకు అన్యాయం!

ఎల్‌నినో ప్రభావంతో పంటలకు తీవ్ర నష్టం, రైతులకు ఎకరాకు రూ.25 వేల ఆర్థిక సహాయం అందించాలి

- బీజేపీ కొండుర్గు మండల అధ్యక్షుడు చిట్టెం లక్ష్మీకాంతరెడ్డి.



రంగారెడ్డి జిల్లా బ్యూరో, నవంబర్ 28 (జర్నలిస్ట్ డైరీ) :
యాసంగి పంటలకు విరామం ప్రకటించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటన రైతుల ప్రయోజనాలకు విరుద్ధమని, రైతులను మరింత ఆర్థిక సంక్షోభంలోకి నెట్టే విధంగా ఉందని బీజేపీ కొండుర్గు మండల అధ్యక్షుడు చిట్టెం లక్ష్మీకాంతరెడ్డి తీవ్రంగా విమర్శించారు.ప్రకృతి వైపరీత్యాలు, ఎల్‌నినో ప్రభావం, వాతావరణ మార్పుల కారణంగా ఇప్పటికే రైతులు తీవ్రంగా నష్టపోయారని, పంటలు చేతికందక పెట్టుబడులు కూడా తిరిగి రాని దుస్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి క్లిష్ట సమయంలో రైతులకు భరోసా కల్పించాల్సిన ప్రభుత్వం, యాసంగి పంటలు వేయవద్దంటూ పంట విరామం ప్రకటించడం బాధ్యతారాహిత్యమని మండిపడ్డారు.రైతులు పంటలు పండించకపోతే వారి కుటుంబాల జీవనోపాధి ఎలా సాగుతుందని ప్రశ్నించారు. వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న లక్షలాది రైతు కుటుంబాలకు యాసంగి పంటలే మరో ఆదాయ వనరు. అలాంటి సమయంలో పంటలు వేయవద్దని చెప్పడం అంటే రైతుల ఆర్థిక పరిస్థితిని మరింత దిగజార్చడమేనని పేర్కొన్నారు.
ఎన్నికల సమయంలో రైతు భరోసా పేరుతో ఎన్నో హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పుడు ఆ నిధుల భారం నుంచి తప్పించుకోవడానికే పంట విరామం పేరుతో కొత్త ఆలోచనకు తెరలేపుతోందనే అనుమానాలు రైతుల్లో వ్యక్తమవుతున్నాయని అన్నారు. రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, పంటలు వేయవద్దని చెప్పడం కాంగ్రెస్ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలకు నిదర్శనమని విమర్శించారు.

రైతులకు బీజేపీ తరఫున మా ప్రధాన డిమాండ్లు:

1. ఎల్‌నినో తదితర ప్రకృతి ప్రభావాలతో నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25,000 చొప్పున తక్షణ పంట నష్టపరిహారం చెల్లించాలి.
2. అర్హులైన ప్రతి రైతుకు యాసంగి రైతు భరోసా నిధులను ఎలాంటి జాప్యం లేకుండా పూర్తిస్థాయిలో అందించాలి.
3. యాసంగి పంటలు సాగు చేసుకునేందుకు రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, సాగునీరు అందుబాటులో ఉంచాలి.
4. పంటల నష్టంపై క్షేత్రస్థాయిలో సమగ్ర సర్వే నిర్వహించి ప్రతి బాధిత రైతుకు న్యాయం చేయాలి.
5. రైతులపై పంట విరామం నిర్ణయాన్ని బలవంతంగా రుద్దకుండా, వారి సాగు స్వేచ్ఛను గౌరవించాలి.

రైతులకు కావాల్సింది పంట విరామం కాదు, పంటకు పెట్టుబడి భరోసా!
రైతులను వ్యవసాయానికి దూరం చేయడం కాదు, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడం ప్రభుత్వ బాధ్యత. రైతుల కన్నీళ్లు తుడవాల్సిన ప్రభుత్వం వారిని మరింత ఆందోళనకు గురిచేయడం సరికాదని, ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి తన ప్రకటనను పునఃసమీక్షించి రైతులకు తక్షణ ఆర్థిక సహాయం ప్రకటించాలని చిట్టెం లక్ష్మీకాంతరెడ్డి డిమాండ్ చేశారు.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

గుడిసెలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దుదాం..

-నీటి ఎద్దడి లేని పల్లెలు నిర్మిద్దాం..

-షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

-జిల్లేడు చౌదరిగూడెం సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే దిశా నిర్దేశం

-మూడు గంటలపాటు సమస్యలపై అధికారులు, ప్రజా ప్రతినిధులకు సమీక్ష

-సమస్యలపై జిల్లా అధికారులతో సమావేశం నుండి ఫోన్ లో మాట్లాడి పరిష్కారం చూపిన ఎమ్మెల్యే



రంగారెడ్డి జిల్లా బ్యూరో, నవంబర్ 28 ,(జర్నలిస్ట్ డైరీ) :

జిల్లేడు చౌదరి గూడెం మండలంలో ఏ గ్రామంలోనైనా ఒక్క గుడిసె కూడా కనిపించకుండా.. వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తానని.. అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం జిల్లేడు చౌదరిగుడా మండల కేంద్రంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్పంచులు గా గెలిచిన తర్వాత ఏ పార్టీ వారైనా అందరికీ అభివృద్ధి ఫలాలు అందించడానికి నేను కృషి చేస్తానని ఎమ్మెల్యే అన్నారు. పార్టీలకు అతీతంగా ఇలాంటి సమావేశాల్లో సమస్యలు తెలిపినప్పుడే వాటిని పరిష్కరించే అవకాశం ఉంటుందని అన్నారు. ప్రజా ప్రతినిధులు అధికారులను ప్రశ్నించాలి వారి నుంచి పనులు చేయించుకోవాలని అన్నారు పరిష్కారం కాని పనులు తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. ఎమ్మెల్యేగా నేను రైతుల కష్టాన్ని తెలుసుకొని మూడు గంటల పాటు అదనంగా విద్యుత్తును రాష్ట్రవ్యాప్తంగా విడుదల చేయించడంలో చేసిన కృషి ఎంతో సంతృప్తిని ఇచ్చిందని అన్నారు. అదేవిధంగా పార్టీలకతీతంగా ఇటీవల పెన్షన్లను దరఖాస్తు చేసుకొని సరైన అయితే చాలు పెన్షన్లు అందించినామన్నారు. రేడియల్ రోడ్డు పరిహారం విషయంలో స్థానికంగా ఉన్న మార్కెట్ ఆధారంగా పరిశీలించి వీలైనంత మేర జిల్లా కలెక్టర్ లతో మాట్లాడి రైతులకు అన్యాయం జరగకుండా అవకాశం ఉన్న మార్గాలు అన్నింటిని అన్వేషించి సరైన లబ్ధి చేకూర్చామని అన్నారు. రాబోయే లక్ష్మీదేవి పల్లి ప్రాజెక్టు విషయంలో సైతం రైతులకు ప్రజల పక్షాన నిలబడే ఎమ్మెల్యేగా నేను పేరు సంపాదించుకోవడం కోసం మీకోసం ఎంతవరకైనా కృషి చేస్తానని అన్నారు. నా ఉద్దేశంలో పార్టీలు కాదు ప్రజల ముఖ్యమని భావిస్తున్నానని రైతులు భూములు కోల్పోయిన సందర్భంలో వారి బాధ నాకు తెలుసు అని వారికి సరైన నష్టపరిహారం అందించడంలో అన్ని చోట్ల అందించిన పరిహారం కంటే ఎంతో కొంత ఎక్కువ అందించి మేలు చేస్తానని సభాముఖంగా హామీ ఇచ్చారు. ప్రస్తుతం గ్రామాల్లో చేపడుతున్న ఇందిరమ్మ బీమా పథకం అన్ని గ్రామాల సర్పంచులు తప్పనిసరిగా ప్రతి ఒకరికి ఆన్లైన్ చేయించాలని సూచించారు.

లినీటి ఎద్దడి రాకుండా ఎలాంటి ప్లాన్ చేస్తారో నాకు చెప్పండిలి లిఎమ్మెల్యేలి

గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోబోతున్నారు వివరించాలని ఎమ్మెల్యే వీళ్ళ పల్లి శంకర్ సర్వసభ్య సమావేశంలో అధికారులను కోరారు. గ్రామాల్లో ప్రస్తుతం నీటి వసతి ఎలా ఉంది భవిష్యత్తులో ఎలాంటి చర్యలు చేపడితే గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చేయగలుగుతామని అంశాలను ప్రజా ప్రతినిధులను కలుపుకొని పోతూ వివరాలు సేకరించాలని అన్నారు. గ్రామాల్లో అవసరం ఉన్నచోట బోరు డ్రిల్లింగ్ చేయించడం ద్వారా నీరు వస్తుందా లేదా అనేది జువాలజిస్ట్ అధికారులతో సర్వే చేయించి ఎక్కడెక్కడ బోర్లు వేయించాలి ఎక్కడెక్కడ సమస్యలు ఉన్నాయి అనేది తమకు ఒక నివేదిక అందించాలని ఆయన సూచించారు. అన్ని గ్రామాల సర్పంచులు బోరు డ్రిల్లింగ్ అవసరం ఉందని, మోటర్లు కావాలని పైపులైన్లు మరమ్మత్తులు ఉన్నాయని ఇలా పలు సమస్యలను ఎంఎల్ఏ తీసుకురాగా ఆయన వెంటనే స్పందించి అవసరమైతే ప్రత్యేకంగా ఈ సమస్యలను పరిష్కరించడానికి కృషి చేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్లు లబ్ధిదారులందరికీ అందించాలని, నామాలవారీగా ఎవరైనా అర్హులు ఉండి వారి ఇల్లు రాకపోతే తమ దృష్టికి తీసుకురావాలని ఎంపీడీవోను సూచించారు. అవసరమైతే మరిన్ని ఇల్లు మంజూరు చేసి లబ్ధిదారులందరికీ అందిస్తానని హామీ ఇచ్చారు. సాయి శాఖ ఉద్యానవన శాఖ అధికారులతో మాట్లాడుతూ రాబోయే ఎల్లీనో ఎఫెక్ట్ను తట్టుకునే విధంగా రైతులకు ఎలాంటి అవగాహన కల్పిస్తున్నారు. ఇలాంటి పంటలు సాగు చేయిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు ఆ శాఖలకు సంబంధించిన జిల్లా అధికారులతో రైతులకు సంబంధించిన పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పరిష్కార మార్గాలు చూపించాలని కోరారు జిల్లేడు చౌదరిగుడా మండలంలో నర్సరీ ఏర్పాటు చేయాలని సూచించారు. అదేవిధంగా విద్యుత్ సమస్యలను గ్రామాల్లో పరిష్కరించాలని స్థానిక ఏఈ, డిఈ లతో పాటు ఎస్ ఈ అధికారులతో మాట్లాడుతూ వ్యవసాయ పంటలు అధికంగా ఉన్న జిల్లేడు చౌదరిరోడ మండలానికి అవసరమైన అన్ని మెటీరియల్స్ ను అందించాలని కోరారు. అంతేకాకుండా గుత్తేదారు 15 రోజులపాటు మండలానికి సమయం కేటాయించి సమస్యలు పరిష్కరించాలని సూచించారు. పలువురు అధికారుల నిర్లక్ష్యాన్ని ఎండగడుతూ మహిళా సమాఖ్య ఏపీయం సమావేశానికి రాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెటర్నరీ డాక్టర్లు గ్రామాల్లో సరైన సేవలు అందించలేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు గోపాల మిత్రులు పలువురు గ్రామాల్లో డబ్బులు వసూలు చేయడంపై ఎమ్మెల్యే అగ్రహారం వ్యక్తం చేశారు. ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా నన్ను వచ్చి కలవాలని రైతుల ఇబ్బందులు పెడితే ఊరుకోబమని హెచ్చరించారు.

దాదాపు మూడు గంటల పాటు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రతినిధులు అందరితో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకొని పరిష్కార మార్గాలు చూపడంతో వారు సంతోషం వ్యక్తం చేశారు. ఈ ఒక్కరైనా అర్హులై ఉండి పథకాలు వారి దరి చేరకుంటే అలాంటివారు నా దృష్టికి వస్తే నిర్లక్ష్యం వహించిన వారందరిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. పనులతో మన జీతాలు తీసుకుంటున్నాం కాబట్టి వారికి అవసరమైన సేవలు అందించేందుకు వీలైనంత మేర శక్తి మేర కృషి చేయాలని ఆయన సూచించారు. చౌదర్ గూడెం లో అండర్ డ్రైనేజీ అదనపు గదులు సిసి రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచులు చంద్రశేఖర్, రామచంద్రయ్య నర్సింలు, చందు నాయక్, బందెయ్య, మోహనా చారి, నీలయ్య, కుమార్, జంగయ్య, జంగయ్య, పావని, అరుణ, సునీత, మౌనిక, విజయలక్ష్మి, స్వప్న, శ్వేత, సోని, సనా, మహబూబ్ బీ, నాయకులు కృష్ణారెడ్డి, చలివేంద్రం పల్లి రాజు, జితేందర్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి, ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రారంభంలో పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- సర్పంచ్ రేండ్ల శారద కుమారస్వామి



రామగిరి,నవంబర్ 28,(జర్నలిస్ట్ డైరీ) :

పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం కల్వచర్ల గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో జనరల్ గ్రామ సభ నిర్వహించారు.గ్రామ సర్పంచ్ రేండ్ల శారద కుమారస్వామి అధ్యక్షతన జరిగిన ఈ గ్రామ సభలో గ్రామ అభివృద్ధి,ప్రజా సమస్యలు,పారిశుధ్యం, తాగునీటి సరఫరా,వీధి దీపాలు,మౌలిక సదుపాయాలు,ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు.ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం గురించి సభలో ప్రజలకు వివరించారు.ఈ పథకం ద్వారా అర్హులైన కుటుంబాలకు కలిగే ప్రయోజనాలు,పథకం అమలు విధానం, అర్హతలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు.అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.గ్రామ సభలో ప్రజలు తమ సమస్యలను సర్పంచ్ దృష్టికి తీసుకువచ్చారు.ముఖ్యంగా గ్రామంలో కోతుల బెడద రోజురోజుకూ పెరుగుతోందని, కోతుల సంచారంతో ప్రజలు,చిన్నపిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు.కోతుల ఇళ్లలోకి చొరబడటం,ఆహార పదార్థాలను ఎత్తుకెళ్లడం,ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు.కోతుల బెడద నివారణకు సంబంధిత అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకోవాలని సర్పంచ్ను కోరారు.ఈ సందర్భంగా సర్పంచ్ రేండ్ల శారద కుమారస్వామి మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని తెలిపారు.ప్రజలు తెలియజేసిన సమస్యలను ప్రాధాన్యత క్రమంలో గుర్తించి,వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.కోతుల బెడద సమస్యను కూడా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు చేపడతామని తెలిపారు.గ్రామ ప్రజలందరూ గ్రామ సభలకు హాజరై తమ సమస్యలు, సూచనలు తెలియజేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఉప్పలేటి ప్రదీప్,ఉపసర్పంచ్ కస్ప మహేందర్,వార్డు సభ్యులు, గ్రామపంచాయతీ సిబ్బంది,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల మెరుపు దాడి



మంథని,నవంబర్ 28 (జర్నలిస్ట్ డైరీ) :

మంథని పట్టణంలోని నడి వీధిలో శనివారం పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో పోలీసులు పేకాట త్రీ కార్డ్స్ జూదం ఆడుతున్న 10 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులకు పట్టుబడిన వ్యక్తులు మిరియాల ప్రసాద్, కొటం నారాయణ, గట్టు భాస్కర్, గట్టు రాధా కృష్ణ, బెల్లం కొండ భూమా రెడ్డి, రాంపల్లి సదాశివ్, చొప్పకట్ల రాజన్న, కొల్లరపు హరీష్, శ్రీపతి బానయ్య, సువర్ణ గణపతిల నుండి రూ.19,960 నగదు, పేక ముక్కలు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనపై మంథని పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశారు. జూదం, చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై పోలీసులు కఠినంగా శిక్షిస్తున్నారు. ఆ సాంఘిక కార్యకలాపాలపై సమాచారం ఎవరికైనా తెలిసినచో మంథని పోలీస్ స్టేషన్కు సమాచారం అందించాల్సిందిగా ఎస్ఐ సందీప్ తెలిపారు..

శ్రీధర్ బాబు మౌనమే అభివృద్ధి...

-ఆయన మాట ప్రజల కష్టాలు తీర్చడానికి
-మంథని అభివృద్ధే ఆయన మంత్రం...
-పెద్దపల్లి నుండి కాళేశ్వరం వరకు నాలుగు లైన్ల రోడ్డు
-గోదావరి తీరాన మహాప్రస్థానం...
-డిపో నుండి గోదావరి వరకు నాలుగు లైన్ల రోడ్డు
-డిపో నుండి పాత పెట్రోలు బంకు మీదుగా రోడ్డు వెడల్పు...
-మంత్రి శ్రీధర్ బాబు చొరవతో అభివృద్ధి వేగం.
-గోదావరి తీరాన పుష్కర ఘాట్లతో మంథనికిమరోకల.



రామగిరి,నవంబర్ 28,(జర్నలిస్ట్ డైరీ) :

మంథని నియోజకవర్గం అభివృద్ధే ఆయన మంత్రం... ఆయన లక్ష్యం గా ముందుకు దూసుకు వెళ్తున్నారు రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుదిల్ల శ్రీధర్ బాబు, నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో నడిపించడమే ఆయన ధ్యేయంగా పావులు కదుపుతున్నారు. ఇప్పటికీ నియోజకవర్గ అభివృద్ధి కొరకు రాష్ట్రంలోనే కోట్లాది రూపాయలు నిధులను మంథని నియోజకవర్గానికి వేచ్చించారు. మంథనిలోని 18 ఆఫీస్ ల ప్రభుత్వ సమీకృత భవనం.అదేవిధంగా అడవి సోమనిపల్లిలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్, మంథని పట్టణంలోని 50 పడకల ప్రభుత్వాసుపత్రి తుది దశకు చేరుకుంది. ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న సహకార సంఘం బ్యాంక్,అదే విధంగా పట్టణంలోని గంగపురి వద్ద గర్మెంటరీ పనులు తుది దశకు చేరాయి.నూతన సబ్ స్టేషన్ ఇటీవల మంత్రి చేతుల మీదుగా ప్రారంభించారు. ప్రభుత్వ స్కూళ్లల్లో చదువుతున్న విద్యార్థులకు ఉదయం పూట అల్పాహారాన్ని అందిస్తున్నారు.పెద్దపల్లి నుండి కాళేశ్వరం వరకు నాలుగు లైన్ల రోడ్డు తో పాటు అన్ని హంగులాలతో గోదావరి తీరాన మహాప్రస్థానం నిర్మాణం.డిపో నుండి గోదావరి వరకు నాలుగు లైన్ల రోడ్డు.డిపో నుండి పాత పెట్రోలు బంకు మీదుగా నాలుగు లైన్లు రోడ్డు నిర్మాణం జరగనుంది. ఇవేకాక మంథని నియోజకవర్గంలో అభివృద్ధి కొరకు అనేక నిధులను మంజూరు చేయించి... కొన్ని అభివృద్ధి పనులు పూర్తి అయ్యాయి.మరికొన్ని నిర్మాణంలో ఉన్నాయి.ఇంకొన్ని తుది దశకు చేరుకున్నాయి.ఇవన్నీ నిర్మాణ పనులు పూర్తి అయితే మంథని నియోజకవర్గం అభివృద్ధి పథంలో ముందుకు దూసుకుపోనుంది.దీంతో మంథని ప్రాంతం రాష్ట్రంలో అగ్రగామిగా నిలవనుంది. అభివృద్ధి శ్రీధర్ బాబు మంత్రమని మంథని ప్రాంత వాసులు మేధావులు,ప్రజలు,ప్రజా సంఘాల నాయకులు తదితరులు రకరకాలుగా అంటున్నారు.

మండలాల సిబ్బందికి సమీక్షా సమావేశం

- స్వయం ఉపాధితో ఆర్థిక అభివృద్ధి సాధించాలి : పీడీ డీఆర్డీఓ



గాంధారి నవంబర్ 28 (జర్నలిస్ట్ డైరీ) :

గాంధారి మండల కేంద్రంలో ఎస్వీఈపీ – బీఆర్సీ పరిధిలోని గాంధారి, లింగంపేట్, ఎల్లారెడ్డి మూడు మండలాలకు సంబంధించిన సిబ్బంది, సీఆర్పీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి పీడీ డీఆర్డీఓ, అడిషనల్ డీఆర్డీఓ హాజరై ఎస్వీఈపీ కార్యక్రమం అమలు తీరుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్వీఈపీ ద్వారా అర్హులైన లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేసే విధానం, మంజూరైన రుణాలను సకాలంలో రికవరీ చేయడం, రుణాల వినియోగాన్ని పర్యవేక్షించడం వంటి అంశాలపై సమగ్రంగా చర్చించారు.

గ్రామీణ ప్రాంతాల్లో ఆదాయాభివృద్ధి కార్యక్రమాలను ప్రోత్సహిస్తూ, మహిళలు మరియు గ్రామీణ ప్రజలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందేలా వివిధ రకాల జీవనోపాధి కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని పీడీ డీఆర్డీఓ సిబ్బందికి, సీఆర్పీలకు పలు సూచనలు, విలువైన సలహాలు అందించారు. ఎస్వీఈపీ లక్ష్యాలను సమర్థవంతంగా సాధించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీపీఎం సాయిలు, ఎస్వీఈపీ ఏపీఎం రాజేందర్, గాంధారి ఏపీఎం ప్రసన్నకుమార్, లింగంపేట్ ఏపీఎం వినోద్, ఎల్లారెడ్డి ఏపీఎం రామ్ నారాయణ గౌడ్, మెంటర్ ప్రియాంక రెడ్డి, ఎస్వీఈపీ అకౌంటెంట్, గాంధారి మండల సమాఖ్య అకౌంటెంట్ సుధాకర్, మూడు మండలాల మండల సమాఖ్య పాలకవర్గ సభ్యులు, సిబ్బంది, సీఆర్పీలు పాల్గొన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో స్వయం ఉపాధి అవకాశాలను పెంపొందించి, ప్రజల ఆర్థిక స్వావలంబనకు ఎస్వీఈపీ కార్యక్రమం దోహదపడేలా కృషి చేయాలని ఈ సమావేశంలో దిశానిర్దేశం చేశారు.

సమాచార హక్కు చట్టం అమలుకు కృషి చేస్తా


గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకతకు ప్రాధాన్యం

దేవరకొండ, నవంబర్ 28 (జర్నలిస్ట్ డైరీ) :

నల్గొండ జిల్లాలో సమాచార హక్కు చట్టం--2005 అమలును మరింత పటిష్టం చేసేందుకు కృషి చేస్తానని జిల్లా ఆర్టీఐ మానిటరింగ్ కమిటీ సభ్యుడు, రైట్ టు ఇన్ఫర్మేషన్ యాక్టివిస్ట్ సొసైటీ (ఆర్టీఐఏఎస్) రాష్ట్ర అధ్యక్షుడు డా. కొర్ర కిషన్ నాయక్ తెలిపారు. తనకు కీలక బాధ్యతలు అప్పగించిన జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఐఏఎస్కు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టం నిబంధనలు సమర్థవంతంగా అమలయ్యేలా తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఆర్టీఐ చట్టంలోని సెక్షన్ 2(హెచ్) పరిధిలోకి వచ్చే ప్రభుత్వ సంస్థల కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టానికి సంబంధించిన బోర్డులు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటానన్నారు. అదేవిధంగా సెక్షన్ 4(1)(బి) ప్రకారం ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించిన కీలక సమాచారాన్ని ప్రజలకు స్వచ్ఛందంగా అందుబాటులో ఉంచేలా కృషి చేస్తానని తెలిపారు. ప్రభుత్వ పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించడంతో పాటు ప్రజలకు సమాచార హక్కుపై అవగాహన కల్పించడం తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ తనపై ఉంచిన నమ్మకాన్ని గౌరవిస్తూ అప్పగించిన బాధ్యతలను చట్టపరిధిలో, నిబద్ధతతో నిర్వహిస్తానని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో చట్ట నిబంధనలు పకడ్బందీగా అమలయ్యేలా నిరంతరం పర్యవేక్షణకు కృషి చేస్తానన్నారు. తనకు ప్రజా ప్రయోజనాల కోసం పనిచేసే అవకాశం కల్పించిన జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్కు మరోసారి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఐఏఎస్ రాష్ట్ర కార్యదర్శి సుప్ప సురేందర్ పాల్గొన్నారు.

2027లో కరోనా కంటే భయంకర పరిస్థితులు?

-కృత్రిమ మేధపై నియంత్రణ కోల్పోతే పెను సంక్షోభం
-రెండు వారాలకు ఆహారం, నగదు నిల్వ చేసుకోండి
-ఏఐ పరిశోధకుడి హెచ్చరిక



అమెరికా

కరోనా మహమ్మారి కంటే దారుణమైన పరిస్థితులు 2027లో ఎదురుకావచ్చని ఓ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) పరిశోధకుడు హెచ్చరించడం కలకలం రేపుతున్నది. ఇంట్లో రెండు వారాలకు సరిపడా ఆహారం, తాగునీరు, కొంత నగదు నిల్వ చేసుకోవాలని తన కుటుంబ సభ్యులకు సూచించాడు.ఏఐ సాంకేతికతపై ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఆందోళనల నేపథ్యంలో ఆయన చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. అమెరికాకు చెందిన ఎంఈటీఆర్ అనే లాభాపేక్షలేని సంస్థలో టెక్నికల్ స్టాఫ్ సభ్యుడిగా పనిచేస్తున్న నికోలా జుర్కోవిక్ తన ఆందోళనలను సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో బహిరంగ లేఖ రూపంలో వెల్లడించాడు. వచ్చే ఏడాది పరిస్థితులు మరింత ప్రమాదకరంగా మారవచ్చని ఆందోళన వ్యక్తం చేశాడు. ఏఐ వల్ల మూడు ప్రధాన ప్రమాదాలు పొంచి ఉన్నాయని హెచ్చరించాడు.


ఎస్సీ, ఎస్టీ మహిళలకు ప్రత్యేక రిజర్వేషన్ కల్పించాలి: మాయావతి



లక్నో:

పార్లమెంట్, రాష్ట్ర శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) అధినేత్రి మాయావతి శనివారం స్వాగతించారు. అయితే షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలకు చెందిన మహిళలకు ప్రత్యేక రిజర్వేషన్ ఉండాలని ఆమె డిమాండ్ చేశారు. 'శతాబ్దాలుగా దోపిడీకి, అణచివేతకు, నిర్లక్ష్యానికి గురైన ఎస్సీ, ఎస్టీ వర్గాల మహిళలకు ఈ కోటాలో ప్రత్యేక రిజర్వేషన్ కల్పించి ఉంటే అది మంచిది, నిజానికి చారిత్రాత్మకమైనది అయ్యేది' అని ఎక్స్ పోస్ట్‌లో పేర్కొన్నారు. ఈ డిమాండ్‌ను సానుభూతితో పరిశీలించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆమె కోరారు.కాగా, లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల్లో ప్రస్తుతం ఉన్న స్థానాల సంఖ్యను 50 శాతం పెంచే ప్రతిపాదన, నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) ప్రక్రియపై ఉత్తర్‌ప్రదేశ్ మాజీ సీఎం అయిన మాయావతి ఆందోళన వ్యక్తం చేశారు. రాజకీయ, ఎన్నికల ప్రయోజనాల కోసం నియోజకవర్గాల సరిహద్దులను నిర్ణయించడంలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు కొత్తేమీ కాదని విమర్శించారు. 'కేంద్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా, అది సాధారణంగా జాతీయ, ప్రజా ప్రయోజనాలకు తక్కువ ప్రాధాన్యతనిస్తూ, తమ సొంత పార్టీ ప్రయోజనాలకు ఎక్కువ ప్రాధాన్యతనిస్తుంది' అని ఆమె ఆరోపించారు.

'సోనియా గాంధీ 1980లో భారత పౌరురాలు కాదు'



ఢిల్లీ

కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకురాలు సోనియా గాంధీ పౌరసత్వ వివాదంపై ఢిల్లీ పోలీసులు శనివారం ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టులో స్టేటస్ రిపోర్టు దాఖలు చేశారు. 1980లో సోనియా గాంధీ భారత పౌరురాలు కాదని, అయినప్పటికీ ఆమె పేరు ఓటరు జాబితాలో నమోదైందని వారు తెలిపారు. 1983లో ఆమెకు భారత పౌరసత్వం మంజూరైనట్లు పేర్కొన్నారు.ఈ వివరాలను జిల్లా మేజిస్ట్రేట్,?ర కేంద్ర హోం శాఖతో ధ్రువీకరించినట్లు వెల్లడించారు. 1983లో భారత పౌరసత్వం పొందిన సోనియా గాంధీ పేరు, 1980లోనే న్యూఢిల్లీ లోక్‌సభ నియోజకవర్గం ఓటరు జాబితాలో నమోదైందని న్యాయవాది వికాస్ త్రిపాఠి వేసిన పిటిషన్ విచారణ సందర్భంగా పోలీసులు కోర్టుకు తాజా నివేదిక అందించారు.

ఇది ప్రజాస్వామ్యానికి ముప్పు తెచ్చే బిల్లు

డీలిమిటేషన్‌పై ఇండియా కూటమి హెచ్చరిక



న్యూఢిల్లీ,

నియోజకవర్గాల పునర్విభజన(డీలిమిటేషన్)పై కేంద్రం ప్రతిపాదించిన రాజ్యాంగ సవరణను వ్యతిరేకించాలని తమ పార్టీ, ఇతర ఇండియా కూటమి మిత్రపక్షాలు సంయుక్తంగా నిర్ణయించాయని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే శనివారం తెలిపారు. ఈ బిల్లును ప్రజాస్వామ్యానికి తీవ్రమైన ముప్పుగా ఆయన అభివర్ణించారు. ఈ బిల్లుకు ఇండియా కూటమి వ్యతిరేకతను వివరిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ గత సార్వత్రిక ఎన్నికల సమయంలో 400 పార్ అనే నినాదం ఇచ్చారు. కానీ ఈ బిల్లును ఆమోదింపచేసుకోవడం ద్వారా శాశ్వతంగా అధికారంలో కొనసాగడానికి, రాజ్యాంగాన్ని మార్చడానికి ఆయన 800 పార్ సంఖ్యను సాధించాలని భావిస్తున్నారు అని ఎక్స్ పోస్టులో ఖర్గే పేర్కొన్నారు. ఒక్కసారి అధికారం వారి చేతుల్లోకి వస్తే వారు శాశ్వతంగా అధికారంలో కొనసాగేందుకు ఈ బిల్లును ఒక ఆయుధంగా ఉపయోగించుకోవడానికి ఏమైనా చేస్తారని, తాము ఈ బిల్లును వ్యతిరేకిస్తామని ఖర్గే విలేకరులతో అన్నారు.

'ప్రజా తీర్పుకు ఘోర ద్రోహం'..

డీలిమిటేషన్ బిల్లును వ్యతిరేకించాలని సీజేపీ పిలుపు




న్యూఢిల్లీ

పార్లమెంటులో నియోజకవర్గాల పునర్విభజన బిల్లును వ్యతిరేకించాలని అన్ని రాజకీయ పార్టీలకు, పార్లమెంటు సభ్యులకు కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) విజ్ఞప్తి చేసింది. ఆ బిల్లు ఆమోదానికి ఏ పార్టీ లేదా రాజకీయ నాయకుడైనా సహకరించడం 'ప్రజల తీర్పుకు ఘోర ద్రోహం' చేసినట్లేనని పేర్కొంది. శనివారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. ప్రతిపాదిత ప్రక్రియలో అత్యంత హానికరమైన అంశం ఉన్నదని సీజేపీ తెలిపింది. అధికార పార్టీకి స్పష్టమైన ప్రయోజనం చేకూర్చేలా పార్లమెంటరీ, విధానసభ నియోజకవర్గాల సరిహద్దులను పక్షపాత ధోరణితో మార్చడాన్ని 'జెర్రీమాండరింగ్' అని పిలుస్తారని పేర్కొంది. భారతదేశ ఎన్నికల చిత్రపటాన్ని 'తారుమారు' చేసే ఈ చర్యకు వ్యతిరేకంగా అన్ని రాజకీయ పార్టీలు ఏకతాటిపై నిలువాలని పిలుపునిచ్చింది.కాగా, ఓటర్లను కొన్ని నియోజకవర్గాల్లో కేంద్రీకరించి, మిగతా వాటిలో విభజించడం ద్వారా, పోలైన మొత్తం ఓట్ల సంఖ్యలో ఎలాంటి మార్పు లేకపోయినా రాజకీయ ఫలితాన్ని ప్రభావితం చేయవచ్చని సీజేపీ ఆందోళన వ్యక్తం చేసింది. తగిన రక్షణలు, స్వతంత్ర పర్యవేక్షణ లేకుండా నియోజకవర్గాల సరిహద్దుల పునర్విభజనను శాశ్వత ఎన్నికల ప్రయోజనం చేకూర్చేందుకు బీజేపీకి ఉపయోగించుకోవచ్చని తాము 'తీవ్రంగా ఆందోళన చెందుతున్నాం' అని ఆ ప్రకటనలో పేర్కొంది. 'ప్రజాస్వామ్య విలువల పట్ల ద్రోహపూరితంగా వ్యవహరిస్తూ, 'సర్' ప్రక్రియలో ఇప్పటికే ప్రజల నమ్మకాన్ని కోల్పోయిన ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ భాగస్వామ్యంతో కూడిన డీలిమిటేషన్ కమిషన్ (నియోజకవర్గాల పునర్విభజన కమిషన్) పట్ల ఎవరికీ ఎలాంటి నమ్మకం కలగదు' అని స్పష్టం చేసింది. మరోవైపు కొన్ని రాజకీయ పార్టీలు ఎలాంటి అవగాహన లేకుండా డీలిమిటేషన్ బిల్లుకు మద్దతు ఇస్తున్నాయని, దీనివల్ల దేశవ్యాప్తంగా లోక్‌సభ స్థానాల సంఖ్య 50 శాతం పెరుగుతుందని వాదిస్తూ తమ నిర్ణయాన్ని సమర్థించుకుంటున్నాయని సీజేపీ నాయకుడు అశుతోష్ రాంకా తెలిపారు. 'తాము ఎలాంటి నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ (జెర్రీమాండరింగ్)కు మద్దతు ఇస్తున్నారో వారికి ఏమాత్రం అవగాహన లేదు. దీనికి ఉదాహరణగా అస్సాంలోని ఎన్నికల నియోజకవర్గాల సరిహద్దులను పరిశీలించండి' అని ఆయన సూచించారు. కాగా, బీజేపీకి, మన ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసే దాని దుష్ట పథకాలకు మేలు చేకూర్చేలా ప్రతిపక్ష పార్టీలు వ్యవహరిస్తే, అది ప్రజలకు చేసే ఘోర ద్రోహం అవుతుందని సీజేపీకి చెందిన మరో నేత సౌరవ్ దాస్ ఆందోళన వ్యక్తం చేశారు. 'ఈ అనైతిక, సూత్రాలు లేని రాజకీయాల మూల్యాన్ని యువత చెల్లించాల్సి వస్తుంది' అని ఆయన పేర్కొన్నారు. అయితే లోక్‌సభ, రాష్ట్ర శాసనసభలలో మహిళలకు సీట్ల రిజర్వేషన్‌కు తమ మద్దతును సీజేపీ పునరుద్ఘాటించింది. 'మహిళా రిజర్వేషన్‌ను పార్లమెంట్ ఇప్పటికే ఆమోదించినప్పటికీ, అది ఇంకా అమలు కాలేదు. ఎన్నికల సరిహద్దులను తారుమారు చేయడానికి దీనిని ఒక ముసుగుగా ఉపయోగించడం, భారతదేశ నియోజకవర్గాల పక్షపాత పునర్విభజన అనే అసలు సమస్య నుంచి దృష్టిని మరల్చడానికి చేస్తున్న ఒక నీచమైన ప్రయత్నం' అని విమర్శించింది.

బిస్లరీ వాటర్‌లో ప్రమాదకర బ్యాక్టీరియా

- బిస్లరీపై వారం వ్యవధిలోనే రెండో ప్రాసిక్యూషన్‌కు ఎఫ్ఎస్ఎస్ఏఐ అనుమతి
- బెంగాల్‌లోని జల్‌పాయ్‌గురి ప్లాంట్ శాంపిల్స్‌లో కోలిఫామ్ బ్యాక్టీరియా గుర్తింపు
- ప్రైమరీ, రెఫరల్ ల్యాబ్ పరీక్షల్లోనూ తేలిన ప్రమాదకర కాలుష్య కారకాలు
- పరిమితికి మించి ప్రమాదకర బ్రోమేట్, పీఏహెచ్ రసాయనాలు ఉన్నట్లు నిర్ధారణ
- గతంలోనూ గోవా ప్లాంట్ నీటి నమూనాలపై నాణ్యతా లోపాల గుర్తింపు
- తమ నీరు సురక్షితమేనంటూ అధికారులకు సహకరిస్తామన్న బిస్లరీ సంస్థ



ప్రముఖ ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ సంస్థ బిస్లరీ ఇంటర్నేషనల్‌పై ప్రాసిక్యూషన్ చర్యలకు భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) అనుమతినిచ్చింది. పశ్చిమ బెంగాల్‌లోని జల్‌పాయ్‌గురి జిల్లా తెలేపారా ప్లాంట్ నుంచి సేకరించిన తాగునీటి నమూనాల్లో ప్రమాదకరమైన కోలిఫామ్ బ్యాక్టీరియా ఉన్నట్లు ల్యాబ్ పరీక్షల్లో తేలడంతో ఈ నిర్ణయం తీసుకుంది. కేవలం వారం వ్యవధిలోనే బిస్లరీ సంస్థపై ఆహార భద్రతా విభాగం ప్రాసిక్యూషన్ చర్యలకు అనుమతి ఇవ్వడం ఇది రెండోసారి కావడం గమనార్హం. జల్‌పాయ్‌గురి ప్లాంట్ నుంచి సేకరించిన నమూనాలను తొలుత ప్రైమరీ ల్యాబ్‌లో, అనంతరం రెఫరల్ ల్యాబ్‌లో పరీక్షించగా రెండింటిలోనూ కోలిఫామ్ బ్యాక్టీరియా ఆనవాళ్లు బయటపడ్డాయి. సాధారణంగా డ్రైనేజీ లేదా మురుగు లీకేజీలు, పగిలిన పైప్‌లైన్ల వల్ల నీటిలో ఈ బ్యాక్టీరియా చేరుతుంది. ఇంతకుముందు గోవా యూనిట్ నుంచి సేకరించిన శాంపిల్స్ సైతం నాణ్యతా ప్రమాణాలను అందుకోవడంలో విఫలమయ్యాయి. అలాగే ఆగస్టు 12న కూడా నాణ్యతా లోపాల కారణంగా ఒక బ్యాచ్ నీటి విక్రయాలపై ఎఫ్ఎస్ఎస్ఏఐ నిషేధం విధించింది. తాజాగా పరిశీలించిన నమూనాల్లో అనుమతించిన పరిమితికి మించి బ్రోమేట్‌తో పాటు పాలీన్యూక్లియర్ ఆరోమాటిక్ హైడ్రోకార్బన్లు (పీఏహెచ్) ఉన్నట్లు తేలింది. ఇవి ఆహార భద్రత, ప్రమాణాల చట్టం-2006 నిబంధనలను తీవ్రంగా ఉల్లంఘించడమేనని అధికారులు స్పష్టం చేస్తూ ఆ నీరు సురక్షితం కాదు అని ప్రకటించారు. సంస్థ విజ్ఞప్తి మేరకు రెండో ల్యాబ్‌లో పరీక్షించినా ఇదే ఫలితం రావడంతో న్యాయపరమైన చర్యలకు రంగం సిద్ధమైంది. అయితే తమ తాగునీరు పూర్తిగా సురక్షితమైనదని, విచారణకు పూర్తిగా సహకరిస్తామని బిస్లరీ యాజమాన్యం పేర్కొంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఆహార, పానీయాల తయారీ సంస్థలపై ఎఫ్ఎస్ఎస్ఏఐ ముమ్మర తనిఖీలు చేపడుతోంది.

వైవాహిక లైంగికదాడిపై చట్టాలేవీ?

-లక్షలాది మహిళలకు రక్షణ కరువు
-దక్షిణాసియాలో దారుణ పరిస్థితులు
-100 దేశాల్లో నేరంగా గుర్తింపు
-భారత్‌లో చట్టపరమైన మినహాయింపు!



న్యూఢిల్లీ

వైవాహిక బంధం మహిళలకు రక్షణ కల్పించాల్సింది పోయి, వారి హక్కులకే భంగం కలిగిస్తున్నది. భార్య సమ్మతి లేకుండా భర్త బలవంతంగా శారీరకంగా కలిస్తే, దాన్ని లైంగిక దాడిగా గుర్తించని చట్టాలు ఇంకా అమల్లో ఉన్నాయి. కాలం మారుతున్నా, వలస పాలన నాటి చట్టాలు మహిళల రక్షణకు అడ్డంకిగా నిలుస్తున్నాయి. దక్షిణాసియాలో లక్షలాది మహిళలు ఇటువంటి పరిస్థితుల్లో చట్టపరమైన భరోసా లేకుండా జీవిస్తున్నారు. భాగస్వాముల నుంచి మహిళలు ఎదుర్కొంటున్న హింస ప్రపంచ సగటు కంటే 35 శాతం అధికంగా ఉండటం ఆందోళన కలిగిస్తున్నది. వైవాహిక అత్యాచారంపై చట్టాలు, మహిళల హక్కులపై తాజాగా వెలువడిన అధ్యయనం ఈ చేదు వాస్తవాలను మరోసారి వెలుగులోకి తెచ్చింది.దక్షిణాసియాలో లక్షలాది మంది మహిళలు, బాలికలకు వైవాహిక అత్యాచారం నుంచి చట్టపరమైన రక్షణ లభించడం లేదని 'సమాజ్' మహిళా హక్కుల సంఘాల కూటమి తాజా అధ్యయనం వెల్లడించింది. ఎనిమిది దక్షిణాసియా దేశాల్లో భాగస్వాముల నుంచి మహిళలు ఎదుర్కొంటున్న హింస ప్రపంచ సగటు కంటే 35 శాతం అధికంగా ఉందని తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా 100కు పైగా దేశాలు వైవాహిక లైంగిక దాడిని నేరంగా గుర్తించగా, భారత్, ఆఫ్ఘనిస్థాన్, శ్రీలంక, బంగ్లాదేశ్‌లలో ఇప్పటికీ పూర్తిస్థాయి నిషేధం లేదు. మాల్దీవుల్లో మాత్రం వివాహ బంధంలో జరిగే లైంగిక దాడికి ఇతర అత్యాచారాల మాదిరిగానే శిక్ష విధిస్తున్నారు. నేపాల్, భూటాన్ దీనిని నేరంగా గుర్తించినా తక్కువ శిక్షలే అమలు చేస్తున్నాయి. దక్షిణాసియాలో ప్రస్తుతం అమల్లో ఉన్న వైవాహిక అత్యాచార చట్టాలు బ్రిటిష్ పాలన కాలం నాటివని అధ్యయనం పేర్కొంది. భారత్, బంగ్లాదేశ్‌లలో 1860 నాటి చట్టాలు, శ్రీలంకలో 1885 నాటి చట్టాలు భర్తకు మినహాయింపునిస్తున్నాయి. భారత్‌లో ఈ నిబంధనలను సవాలు చేస్తూ దాఖలైన పది పిటిషన్లు సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్నాయి. వీటిపై డిసెంబర్ 9 నుంచి తుది విచారణ జరగనుంది. అయితే, ఈ నేరాన్ని చట్టబద్ధంగా గుర్తించడం కుటుంబ వ్యవస్థకు, మతపరమైన విలువలకు విఘాతమని కేంద్ర ప్రభుత్వం, కొన్ని మత సంస్థలు, పురుషుల హక్కుల సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి. పాకిస్థాన్ 2006లో ఈ మినహాయింపును తొలగించినప్పటికీ, అక్కడ చట్టపరమైన స్పష్టతపై సందేహాలున్నాయి.

అవయవాల మార్పిడి కోసం లక్ష మంది ఎదురు చూపు



న్యూఢిల్లీ : మన దేశంలో అవయవాల మార్పిడి కోసం లక్ష మందికిపైగా ఎదురు చూస్తున్నారు. కాగా, ప్రతి 20 నిమిషాలకు ఒక రోగి ఈ జాబితాలో చేరుతున్నారు. సంవత్సరానికి 1.75 లక్షల నుంచి 2 లక్షల మందికి మూత్రపిండాల మార్పిడి చేయవలసి ఉన్నది. ఈ నెల 5నాటికి కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ వెయిటింగ్ లిస్ట్‌లో సుమారు 80,000 మంది ఉన్నారు. ఈ వివరాలను కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖకు చెందిన నేషనల్ ఆర్గాన్ అండ్ టిష్యూ ట్రాన్స్‌ప్లాంట్ ఆర్గనైజేషన్ డైరెక్టర్ డాక్టర్ అనిల్ కుమార్ చెప్పారు.ఇండియన్ విమెన్ ప్రెస్ కార్ప్స్ జర్నలిస్టులతో ఆయన మాట్లాడారు. ఈ నెల 5 నాటికి 20,138 ట్రాన్స్‌ప్లాంట్స్ జరిగాయని, అవయవ మార్పిడిలో ప్రపంచంలో మూడో స్థానంలో భారతదేశం ఉందని తెలిపారు. డిమాండ్‌కు తగిన స్థాయిలో అవయవదానం జరగడం లేదన్నారు. అవయవాలు అందుబాటులో ఉంటే అనేక మంది ప్రాణాలను కాపాడగలుగుతామని తెలిపారు. ప్రపంచ దేశాలతో పోల్చుకుంటే, మన దేశంలో జీవించి ఉన్న కాలంలో అవయవాల దానం మరణానంతర దానాల కన్నా ఎక్కువ అని చెప్పారు.

విదేశీ ఉద్యోగులకు యూఎస్ ఐబీఎమ్ షాక్

హెచ్-1బీ వీసా, గ్రీన్ కార్డు నిలిపివేస్తున్నట్టు ప్రకటన



న్యూఢిల్లీ

ఐబీఎమ్ సంస్థ తన కన్సల్టింగ్ విభాగంలో పనిచేస్తున్న విదేశీ ఉద్యోగుల్లో అత్యధిక మందికి హెచ్-1బీ వీసాలు, గ్రీన్‌కార్డుల స్పాన్సర్‌షిప్‌లు నిలిపివేస్తున్నట్టు తెలిపింది. ఈ నిర్ణయంతో ప్రభావితం అయ్యే ఉద్యోగులకు రెండు అవకాశాలిచ్చింది.వేరే దేశానికి బదిలీపై వెళ్లడం లేదా ఉద్యోగానికి రాజీనామా చేయడం. రాజీనామా చేసే వారికి మూడు వారాల గడువు ఇచ్చింది. ఉద్యోగాన్ని వదులుకునేవారికి మూడు నెలల జీతం అందించనున్నారు. నైపుణ్యం కలిగిన విదేశీ ఉద్యోగుల కొరత వల్ల ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఐబీఎం వెల్లడించింది.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

బిజినెస్

తగ్గిన బంగారం ధరలు

- హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో పసిడి ధరలకు స్వల్ప తగ్గుదల
- 24 క్యారెట్ల 10 గ్రాములపై రూ.540 పతనం
- రూ.1,27,860కు చేరిన 24 క్యారెట్ల బంగారం
- 22 క్యారెట్ల పసిడిపై రూ.500 తగ్గింపు
- రూ.1,17,200 వద్ద కొనసాగుతున్న 22 క్యారెట్ల ధర
- కిలో వెండిపై రూ.100 పెరుగుదల
- రూ.1,70,100కు చేరిన వెండి ధర
- ప్రాంతాలను బట్టి ధరల్లో స్వల్ప వ్యత్యాసాలు



హైదరాబాద్:
బంగారం కొనుగోలుదారులకు కొంత ఊరట లభించింది. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో శనివారం పసిడి ధరలు స్వల్పంగా తగ్గాయి. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.540 తగ్గి రూ.1,27,860కు చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.500 తగ్గి రూ.1,17,200 వద్ద కొనసాగుతోంది.
మరోవైపు వెండి ధర మాత్రం స్వల్పంగా పెరిగింది. కిలో వెండిపై రూ.100 పెరగడంతో ధర రూ.1,70,100కు చేరింది. బంగారం ధరలు తగ్గడం కొనుగోలుదారులకు కొంత ఊరటనిచ్చినా, వెండి ధరలో స్వల్ప పెరుగుదల నమోదైంది. తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాలను బట్టి బంగారం, వెండి ధరల్లో స్వల్ప మార్పులు ఉండవచ్చు. మార్కెట్‌లో కొనుగోలు చేసే సమయంలో స్థానిక ధరలను పరిశీలించాలి.

హిమాలయన్ 750 ఆవిష్కరించిన రాయల్ ఎన్‌ఫీల్డ్

- గోవాలో మోటోవర్స్ వేడుకలో కొత్త బైక్ ఆవిష్కరణ
- 743 సీసీ సామర్థ్యంతో ప్యారలల్ ట్విన్ ఇంజిన్
- 54 బీహెచ్‌పీ శక్తి.. 63 ఎన్‌ఎం టార్క్
- కార్నరింగ్ ఏబీఎస్ వంటి ఆధునిక సదుపాయాలు
- రైడింగ్ మోడ్లతో ప్రత్యేకంగా రూపకల్పన
- ప్రారంభ ధర రూ.4,89,490గా నిర్ణయం
- డిసెంబర్ 1 నుంచి దేశవ్యాప్తంగా బుకింగ్స్
- కొత్త మోడల్‌పై బైక్ ప్రియుల్లో ఆసక్తి



గోవా:
ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ రాయల్ ఎన్‌ఫీల్డ్ తన సరికొత్త హిమాలయన్ 750 బైక్‌ను గోవాలో జరిగిన మోటోవర్స్ కార్యక్రమంలో అధికారికంగా ఆవిష్కరించింది. శక్తిమంతమైన ఇంజిన్, ఆధునిక సాంకేతిక సదుపాయాలతో ఈ కొత్త మోడల్‌ను రూపొందించింది. సాహసయాత్రలు, సుదూర ప్రయాణాలను దృష్టిలో ఉంచుకొని దీన్ని అభివృద్ధి చేసినట్లు సంస్థ వెల్లడించింది. హిమాలయన్ 750లో 743 సీసీ సామర్థ్యం కలిగిన ప్యారలల్ ట్విన్ ఇంజిన్‌ను అమర్చారు. ఇది 54 బీహెచ్‌పీ గరిష్ఠ శక్తిని, 63 ఎన్‌ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. ప్రయాణంలో భద్రత, నియంత్రణకు ప్రాధాన్యమిస్తూ కార్నరింగ్ ఏబీఎస్, రైడింగ్ మోడ్ల వంటి ఆధునిక సదుపాయాలను అందించారు. వివిధ రహదారులపై ప్రయాణించేందుకు అనుగుణంగా ఈ బైక్‌ను రూపొందించారు. ఈ మోడల్ ప్రారంభ ధరను రూ.4,89,490గా కంపెనీ నిర్ణయించింది. డిసెంబర్ 1, 2026 నుంచి దేశవ్యాప్తంగా బుకింగ్స్ ప్రారంభించనున్నట్లు ప్రకటించింది. కొత్త ఇంజిన్ సామర్థ్యం, సాంకేతిక సదుపాయాలు, ధరతో హిమాలయన్ 750 మార్కెట్లో ఎలాంటి స్పందన పొందుతుందో చూడాలి.

జనవరి 16న హ్యుందాయ్ 'ఐయోనిక్ P' ఆవిష్కరణ

- 2027 జనవరి 16న కొత్త విద్యుత్ ఎస్‌యూవీ పరిచయం
- నాలుగు మీటర్లలోపు పొడవుతో ప్రత్యేక రూపకల్పన
- చతురస్రాకార ఆకృతిలో ఆకట్టుకునే రూపం
- పిక్సెల్ శైలిలో ఎల్‌ఈడీ లైట్ల ఏర్పాటు
- ఈ-జీఎంబీ (కె) వేదికపై వాహనం తయారీ
- ప్లియోస్ అనుసంధాన వ్యవస్థ ఉండే అవకాశం
- రెండో స్థాయి ఆధునిక డ్రైవర్ సహాయక సదుపాయాలు
- 42, 49 కిలోవాట్ గంటల బ్యాటరీ ఎంపికలు



ప్రముఖ వాహన తయారీ సంస్థ హ్యుందాయ్ మోటార్ ఇండియా తన సరికొత్త విద్యుత్ ఎస్‌యూవీ 'ఐయోనిక్ ఎ'ను వచ్చే ఏడాది జనవరి 16న అధికారికంగా ఆవిష్కరించనుంది. నాలుగు మీటర్లలోపు పొడవు కలిగిన వాహన విభాగంలోకి తీసుకురానున్న ఈ కారు ప్రత్యేకమైన రూపకల్పనతో వినియోగదారులను ఆకట్టుకునేలా రూపొందుతోంది. చతురస్రాకార ఆకృతి, పిక్సెల్ శైలిలో రూపొందించిన ఎల్‌ఈడీ లైట్లు దీని ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. ఈ వాహనాన్ని ఈ-జీఎంబీ (కె) వేదికపై నిర్మిస్తున్నారు. ఇందులో ప్లియోస్ అనుసంధాన వ్యవస్థతో పాటు రెండో స్థాయి ఆధునిక డ్రైవర్ సహాయక సదుపాయాలు (ఏడీఏఎస్) అందుబాటులో ఉండే అవకాశం ఉంది. భద్రత, సౌకర్యం, సాంకేతికతకు ప్రాధాన్యమిస్తూ ఈ కారును రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. ఐయోనిక్ ఎలో 42 కిలోవాట్ గంటలు, 49 కిలోవాట్ గంటల సామర్థ్యం కలిగిన రెండు బ్యాటరీ ఎంపికలు ఉండనున్నాయి. ప్రామాణిక, అధిక దూర ప్రయాణ శ్రేణి నమూనాల్లో ఇది మార్కెట్లోకి వచ్చే అవకాశం ఉంది. ఆవిష్కరణ అనంతరం ధర, పూర్తి సాంకేతిక వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

స్పోర్ట్స్

తండ్రిగా మారాక నాలో వచ్చిన మార్పు అదే: రోహిత్ శర్మ

-తండ్రి అయ్యాక కోపాన్ని అదుపులో ఉంచుకోవడం నేర్చుకున్నానన్న రోహిత్
-ఢిల్లీ మ్యాచ్‌లో దివ్యాంగ అభిమానితో మాట్లాడిన ఘటనను గుర్తు చేసుకున్న హిట్ మ్యాన్
-అభిమానుల వల్లే క్రికెట్‌కు గుర్తింపు అని, వారిని ఎంతగానో గౌరవిస్తానని వెల్లడి
-ఎండలో, కష్టపడి మ్యాచ్ చూడటానికి వచ్చే అభిమానుల డెడికేషన్‌కు సెల్యూట్ అన్న రోహిత్
-'ఫ్యామిలీ ఫుల్ హౌస్' షోలో తన వ్యక్తిగత విషయాలను పంచుకున్న భారత మాజీ కెప్టెన్



టీమిండియా కెప్టెన్, హిట్ మ్యాన్ రోహిత్ శర్మ తన వ్యక్తిగత జీవితానికి సంబంధించి కొన్ని ఆసక్తికర విషయాలను పంచుకున్నాడు. తండ్రి అయిన తర్వాత తనలో వచ్చిన మార్పుల గురించి, అభిమానుల పట్ల తనకున్న గౌరవం గురించి మనసు విప్పి మాట్లాడాడు. సోనీ ఎంటర్‌టైన్‌మెంట్ టెలివిజన్‌లో ప్రసారమయ్యే 'ఫ్యామిలీ ఫుల్ హౌస్' అనే కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్న రోహిత్, అభిమానుల మనసు గెలుచుకునేలా వ్యాఖ్యలు చేశాడు. ఈ కార్యక్రమంలో సుభాష్ అనే కంటెస్టెంట్, "మీరు క్రికెట్ ఆడుతూనే తండ్రి అయ్యారు కదా. క్రికెట్ మీకు తండ్రిగా ఏం నేర్పించింది?" అని రోహిత్‌ను ప్రశ్నించారు. దీనికి రోహిత్ సమాధానమిస్తూ, "క్రికెట్ ఆడేటప్పుడు కోపం రావడం సహజం. కానీ, ఇంటికి వెళ్లాక మాత్రం ఒకటి రెండు నిమిషాల్లోనే నా కోపాన్ని అదుపులో ఉంచుకోవడానికి ప్రయత్నిస్తాను. ఈ మార్పు నాన్న అయ్యాకే నాలో వచ్చింది. సహనాన్ని నేను తండ్రి అయ్యాకే నేర్చుకున్నాను" అని తెలిపాడు. ఈ సంభాషణ సందర్భంగా, కంటెస్టెంట్ సుభాష్ ఒక పాత సంఘటనను గుర్తు చేసుకున్నారు. "సార్, ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో ఇండియా-న్యూజిలాండ్ మ్యాచ్ జరుగుతున్నప్పుడు మీరు బౌండరీ లైన్ దగ్గర నిలబడి ఉన్నారు. నేను మీ వెనకే ఉన్నాను. అప్పుడు మీరు ఒక దివ్యాంగ అభిమానితో ఎంతో ఆప్యాయంగా మాట్లాడటం చూశాను. ఆరోజు మిమ్మల్ని కలవలేకపోయాను, కానీ ఈరోజు ప్రత్యేకంగా ఢిల్లీ నుంచి మిమ్మల్ని కలవడానికే వచ్చాను" అని చెప్పారు. ఈ మాట వినగానే రోహిత్ వెంటనే ఆ ఘటనను గుర్తు చేసుకున్నాడు. "అవును, నాకు బాగా గుర్తుంది. అతను టీమిండియాకు చాలా పెద్ద అభిమాని. చాలా మ్యాచ్‌లకు వస్తుంటాడు. అలాంటి స్థితిలో కూడా జట్టును ప్రోత్సహించడానికి వచ్చినప్పుడు, మాకు కూడా సంతోషంగా ఉంటుంది. అలాంటి వ్యక్తికి మా సమయం నుంచి ఓ రెండు నిమిషాలు కేటాయించలేమా?" అంటూ తన ఉదారతను చాటుకున్నాడు. అభిమానుల గురించి రోహిత్ మాట్లాడుతూ.. "అభిమానులు లేకపోతే ఈ ఆటే లేదు. స్టేడియానికి వచ్చే ప్రతీ అభిమానికి మేం ఎంతో గౌరవం ఇస్తాం. ఎందుకంటే, వాళ్లు ఎన్ని కష్టాలు పడి మ్యాచ్ చూడటానికి వస్తారో నాకు తెలుసు. రైళ్లలో ప్రయాణించి, రద్దీలో ఇబ్బందులు పడి వస్తుంటారు. స్టేడియంలోకి వెళితే వేలాది మంది ఉంటారు, కొన్నిసార్లు కూర్చోవడానికి సీటు కూడా దొరకదు. అయినా గంటల తరబడి అలాగే ఉంటారు. ముఖ్యంగా ఇండియాలో ఎండ ఎక్కువగా ఉన్నప్పుడు ఆ వేడిలో కూర్చుని మ్యాచ్ చూసే వారి డెడికేషన్‌కు మేం ఎంతో విలువిస్తాం" అని వివరించాడు. రోహిత్ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతూ, అభిమానుల ప్రశంసలు అందుకుంటున్నాయి.

రహానే రిటైర్మెంట్.. కోల్‌కతా పగ్గాలు రింకూ చేతికేనా?

-రహానే రిటైర్మెంట్‌తో కేకేఆర్‌లో ఖాళీ అయిన సారథి స్థానం
-జట్టు యాజమాన్యం రింకూ వైపే మొగ్గుచూపుతుందన్న ఇర్ఫాన్ పఠాన్
-గత సీజన్‌లో వైస్ కెప్టెన్‌గా ఉన్నందున రింకూకే ప్రాధాన్యమన్న చోప్రా
-కామెరాన్ గ్రీన్‌ను రూ.25.20 కోట్లకు రిటైన్ చేయడంపై చర్చ
-డిసెంబర్ 16న గోవా వేదికగా జరగనున్న ఐపీఎల్ మినీ వేలం



భారత స్టార్ బ్యాటర్ రింకూ సింగ్ ఐపీఎల్ 2027 సీజన్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) కొత్త కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టే అవకాశాలు మెండుగా ఉన్నాయని మాజీ పేసర్ ఇర్ఫాన్ పఠాన్ పేర్కొన్నాడు. అజింక్య రహానే క్రికెట్‌లోని అన్ని ఫార్మాట్ల నుంచి రిటైర్మెంట్ ప్రకటించడంతో కేకేఆర్‌లో సారథి స్థానం ఖాళీ అయింది. డిసెంబర్ 16న గోవా వేదికగా జరగనున్న మినీ వేలానికి ముందే జట్టు నాయకత్వంపై చర్చ జోరందుకుంది. జియోస్టార్‌తో మాట్లాడిన ఇర్ఫాన్ పఠాన్, ప్రస్తుత కేకేఆర్ జట్టులో నాయకత్వ అనుభవం ఉన్న ఆటగాళ్ల కొరత ఉందని తెలిపాడు. వేలంలో వెస్టిండీస్ కెప్టెన్ షాయ్ హోప్ వంటి ఆటగాడిని కొనుగోలు చేసి పగ్గాలు అప్పగించే అవకాశం ఉన్నప్పటికీ, జట్టు యాజమాన్యం ఆలోచనా సరళిని బట్టి చూస్తే రింకూ సింగ్‌కే కెప్టెన్సీ పగ్గాలు దక్కవచ్చని విశ్లేషించాడు. రహానే నిష్క్రమణతో రఘువంశీ ఓపెనర్‌గా వచ్చే వెసులుబాటు దక్కుతుందని, హర్షిత్ రాణా ఫిట్‌నెస్ సాధించి బౌలింగ్‌కు సిద్ధమవడం జట్టుకు కలిసొచ్చే అంశమని చెప్పాడు. మాజీ ఓపెనర్ ఆకాశ్ చోప్రా సైతం రింకూ సింగ్ పేరును సమర్థించాడు. గత సీజన్‌లో కేకేఆర్ వైస్ కెప్టెన్‌గా ఉన్న రింకూకు ఇప్పుడు సారథ్య బాధ్యతలు ఇవ్వడమే సరైన నిర్ణయమని అభిప్రాయపడ్డాడు. అనుభవజ్ఞుడైన సునీల్ నరైన్ కూడా తాత్కాలిక ఎంపికగా ఉపయోగపడగలడని సూచించాడు. మరోవైపు ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ కామెరాన్ గ్రీన్‌ను రూ.25.20 కోట్ల భారీ ధరకు అట్టిపెట్టుకోవడంపై చోప్రా ఆశ్చర్యం వ్యక్తం చేశాడు. గ్రీన్‌ను విడుదల చేసి ఉంటే వేలంలో రూ.41 కోట్ల కంటే ఎక్కువ పర్స్‌తో దిగే వెసులుబాటు దక్కేదని, యాషెస్ సిరీస్ నేపథ్యంలో గాయాల బారిన పడి గ్రీన్ లభ్యతపై అనుమానాలు ఉన్నాయని గుర్తుచేశాడు. జట్టుకు ఇంకో ఫాస్ట్ బౌలర్, మిడిలార్డర్ బ్యాటర్ అవసరమని మాజీ బ్యాటర్ అభినవ్ ముకుంద్ పేర్కొన్నాడు.

ముగిసిన రెండో రోజు ఆట.. కష్టాల్లో టీమిండియా.. పట్టు బిగించిన కివీస్

రెండో టెస్టుపై పూర్తి పట్టు సాధించిన న్యూజిలాండ్
తొలి ఇన్నింగ్స్‌లో కివీస్ 356 పరుగులకు ఆలౌట్
ఐదు వికెట్లతో సత్తా చాటిన భారత బౌలర్ ఆకాశ్ దీప్
రెండో రోజు ఆట ముగిసేసరికి భారత్ 116/6
ఇంకా 240 పరుగులు వెనుకబడిన టీమిండియా



భారత్‌తో జరుగుతున్న రెండో టెస్టులో న్యూజిలాండ్ పట్టు బిగించింది. తొలి ఇన్నింగ్స్‌లో 356 పరుగుల భారీ స్కోరు సాధించిన కివీస్, అనంతరం భారత బ్యాటింగ్ ఆర్డర్‌ను కుప్పకూల్చింది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి టీమిండియా 6 వికెట్ల నష్టానికి 116 పరుగులు మాత్రమే చేసి తీవ్ర కష్టాల్లో పడింది. ప్రస్తుతం భారత్ ఇంకా 240 పరుగులు వెనుకబడి ఉంది. రెండో రోజు ఆటలో న్యూజిలాండ్ తమ తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించింది. ఓవర్‌నైట్ బ్యాటర్ టామ్ బ్లండెల్ అద్భుతమైన బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. భారత బౌలర్లను ఓపికగా ఎదుర్కొంటూ స్కోరు బోర్డును ముందుకు నడిపించాడు. తన 50వ టెస్టులో సెంచరీకి చేరువైన బ్లండెల్, 211 బంతుల్లో 10 ఫోర్లతో 89 పరుగులు చేసి గుర్నూర్ బ్రార్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. అతనికి లోయర్ ఆర్డర్ బ్యాటర్లు నాథన్ స్మిత్ (26), కైల్ జేమీసన్ (19), మాట్ హెన్రీ (19) నుంచి విలువైన సహకారం లభించింది. దీంతో న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 356 పరుగులకు ఆలౌటైంది. భారత బౌలర్లలో యువ పేసర్ ఆకాశ్ దీప్ అద్భుతంగా రాణించాడు. టెస్టు క్రికెట్‌లో తన రెండో ఐదు వికెట్ల ప్రదర్శన నమోదు చేస్తూ 95 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టాడు. అన్షుల్ కంబోజ్, గుర్నూర్ బ్రార్ చెరో రెండు వికెట్లు తీశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన భారత్‌కు ఆదిలోనే భారీ షాక్ తగిలింది. ఓపెనర్ యశస్వి జైస్వాల్ (0) మాట్ హెన్రీ బౌలింగ్‌లో క్లీన్ బౌల్డ్ అయ్యాడు. దేవదత్ పడిక్కల్ (21), కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (17) దూకుడుగా ఆడే ప్రయత్నం చేసినా ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోయారు. కైల్ జేమీసన్ తన పదునైన బౌలింగ్‌తో వీరిద్దరినీ పెవిలియన్‌కు పంపాడు. కేఎల్ రాహుల్ (25) నిలకడగా ఆడుతున్నట్లు కనిపించినా, జాకబ్ డఫీ బౌలింగ్‌లో ఔటయ్యాడు. రిషబ్ పంత్ (23) కూడా దూకుడుగా ఆడి వికెట్ చేజార్చుకున్నాడు. రోజు ఆట ముగిసే చివరి ఓవర్‌లో వాషింగ్టన్ సుందర్ (10) కూడా ఔట్ కావడంతో భారత్ తీవ్ర ఒత్తిడిలో పడింది. ప్రస్తుతం ధ్రువ్ జురెల్ (7) క్రీజులో ఉన్నాడు. కివీస్ బౌలర్లలో కైల్ జేమీసన్, జాకబ్ డఫీ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. మూడో రోజు ఆటలో భారత బ్యాటర్లు అద్భుతం చేస్తే తప్ప ఈ మ్యాచ్‌లో ఓటమి నుంచి గట్టెక్కడం కష్టంగా కనిపిస్తోంది.

‘ఇడుపు కాయితం’ నుంచి మరో ఫోక్ మెలోడీ..

‘ఉల్లిపూల సిరే గట్టి’ పాట విడుదల!



టాలీవుడ్ నటుడు ప్రియదర్శి, జానపద గీతాలతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నాగదుర్గ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం ‘ఇడుపు కాయితం’ . వంశీరెడ్డి దొండపాటి దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ ఫ్యామిలీ డ్రామాను సుకుమార్ రైటింగ్స్‌తో కలిసి బన్నీ వాస్ వర్క్స్ పతాకంపై బన్నీ వాస్, తబిత సుకుమార్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన ప్రచార చిత్రాలు, పాటలకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభిస్తుండగా, తాజాగా చిత్రబృందం మరో కొత్త పాటను విడుదల చేసింది.డిసెంబరు 11న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానున్న నేపథ్యంలో ప్రమోషన్ల వేగాన్ని పెంచిన మేకర్స్, శనివారం ‘ఉల్లిపూల సిరే గట్టి.. ఉత్తరాది సెరువే దాటి’ అనే పాటను ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. సురేష్ బొబ్బిలి సంగీతం అందించిన ఈ పాట పక్కా తెలంగాణ కుటుంబ నేపథ్యం, గ్రామీణ వాతావరణం ఉట్టిపడేలా సాగుతూ శ్రోతలను విశేషంగా ఆకట్టుకుంటోంది. పాటలోని సాహిత్యం, సంగీతంతో పాటు ప్రియదర్శి, నాగదుర్గల మధ్య కెమిస్ట్రీ సహజసిద్ధంగా ఉండి సినిమాపై అంచనాలను మరింత పెంచుతోంది. ఈ చిత్రంలో శివజ్యోతి, సుజాత, రచ్చ రవి, బిత్తిరి సత్తి, అభయ్ బేతిగంటి తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. తెలంగాణ నేటివిటీతో కూడిన భావోద్వేగభరితమైన కథాంశంతో తెరకెక్కిన ‘ఇడుపు కాయితం’ బాక్సాఫీస్ వద్ద ఎలాంటి విజయాన్ని అందుకుంటుందో చూడాలి.

నాని కెరీర్‌లో కీలక నిర్ణయం.. ఇకపై అలాంటి సినిమాలకు దూరం..!



టాలీవుడ్‌లో సహజమైన నటనతో ‘నేచురల్ స్టార్’గా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న హీరో నాని తన కెరీర్ విషయంలో కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. మొదటి నుంచి వైవిధ్యమైన కథలను ఎంచుకుంటూ, కుటుంబ ప్రేక్షకులకు దగ్గరైన నాని.. గత కొంతకాలంగా తన సినిమాల ఎంపికలో కొత్త పంథాను అనుసరిస్తున్నారు. ‘దసరా’ సినిమాతో మాస్ ఇమేజ్‌ను సొంతం చేసుకున్న ఆయన, ఆ తర్వాత ‘హిట్ 3’, ‘ది ప్యారడైజ్’ వంటి చిత్రాలతో మరింత రా అండ్ రస్టిక్ పాత్రల్లో కనిపించారు. అయితే ఇప్పుడు మళ్లీ తన పాత ఇమేజ్‌కు దగ్గరయ్యేలా కుటుంబ ప్రేక్షకులు మెచ్చే కథలపై దృష్టి పెట్టాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం.నాని కెరీర్ ప్రారంభం నుంచి ఎక్కువగా ప్రేమకథలు, కామెడీ, కుటుంబ భావోద్వేగాలతో కూడిన సినిమాలు చేస్తూ వచ్చారు. ‘అలా మొదలైంది’, ‘భలే భలే మగాడివోయ్’, ‘జెర్సీ’, ‘నిన్ను కోరి’, ‘హాయ్ నాన్న’ వంటి చిత్రాలు ఆయనకు ప్రత్యేకమైన గుర్తింపును తీసుకొచ్చాయి. అయితే ‘దసరా’ విజయంతో మాస్ సినిమాలపై ఆసక్తి పెంచుకున్న నాని.. వరుసగా యాక్షన్ ప్రధానమైన కథలను ఎంచుకున్నారు. ‘హిట్ 3’, ‘ది ప్యారడైజ్’ వంటి సినిమాల్లో హింస, రక్తపాతం ఎక్కువగా ఉండే పాత్రల్లో కనిపించారు. కానీ ఇలాంటి కథలు తనను ఇష్టపడే కుటుంబ ప్రేక్షకులందరికీ నచ్చకపోవచ్చనే అభిప్రాయం నానిలో కలిగినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా పిల్లలు, కుటుంబ సభ్యులు కలిసి తన సినిమాలను చూడాలనే ఉద్దేశంతో ఇకపై కొంతకాలం హింసాత్మక యాక్షన్ చిత్రాలకు దూరంగా ఉండాలని భావిస్తున్నారట. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో నాని తన సినిమాల ఎంపిక గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తుంది. తాను ఎక్కడికి వెళ్లినా ముందుగా చిన్నపిల్లలే తన దగ్గరకు వస్తుంటారని, వారితో పాటు కుటుంబ సభ్యులందరూ కలిసి తన సినిమాలను చూసేలా కథలను ఎంచుకోవాలనుకుంటున్నట్లు వెల్లడించారు. అందుకే ఇకపై క్లీన్ ఎంటర్‌టైనర్స్, భావోద్వేగాలతో కూడిన కథలకు ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం సుజీత్ దర్శకత్వంలో ‘బ్లడీ రోమియో’ సినిమాలో నాని నటిస్తున్నారు. ఈ చిత్రంలో యాక్షన్ అంశాలు ఉన్నప్పటికీ, ‘ది ప్యారడైజ్’ తరహాలో కాకుండా స్టైలిష్‌గా, వినోదాత్మకంగా ఉంటుందని ఆయన చెప్పినట్లు తెలుస్తోంది. ఈ సినిమా పూర్తయిన తర్వాత ఓ అందమైన, సున్నితమైన ప్రేమకథలో నటించబోతున్నట్లు కూడా నాని వెల్లడించినట్లు సమాచారం. నాని తదుపరి ప్రాజెక్టుల విషయంలో మరో ఆసక్తికరమైన వార్త వినిపిస్తోంది



ధైర్యంగా ఆ సీన్స్ పూర్తిచేశా!

‘ప్రస్తుతం పాత్రలపరంగా ప్రయోగాల్ని ఇష్టపడుతున్నా. నా కంఫర్ట్‌జోన్ దాటి సినిమాలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నా. ఒకే తరహా పాత్రలు, కథల్ని రిపీట్ చేయకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నా’ అని చెప్పింది మీనాక్షి చౌదరి. ఆమె నాగచైతన్యతో కలిసి నటించిన తాజా చిత్రం ‘పృషకర్మ’ డిసెంబర్ 4న విడుదలకానుంది. కార్తీక్ దండు దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా మీనాక్షి చౌదరి పాత్రికేయులతో ముచ్చటించింది.ఈ సినిమాలో తాను ఆర్కియాలజీలో థిసెస్ చేసే దక్ష అనే అమ్మాయి పాత్రలో కనిపిస్తానని, ఇప్పటివరకు వచ్చిన హారర్, మిథికల్ థ్రిల్లర్స్‌కు పూర్తి భిన్నమైన కథాంశమిదని చెప్పింది. ఆమె మాట్లాడుతూ ‘ఈ సినిమాలో విజువల్స్, యాక్షన్ ఘట్టాలు అబ్బురపరుస్తాయి. నాకు ఎత్తైన ప్రదేశాలంటే చాలా భయం. ఈ సినిమాలో అలాంటి సీన్స్ ఉన్నాయి. అవి ఛాలెంజింగ్‌గా అనిపించాయి. ఏమాత్రం భయపడకుండా ధైర్యంగా ఆ సీన్స్ పూర్తిచేశాను’ అని తెలిపింది. హీరో నాగచైతన్య మృదుస్వభావి, సహృదయుడని..ఆయనతో పనిచేయడం చాలా సౌకర్యవంతంగా అనిపించిందని మీనాక్షి చౌదరి పేర్కొన్నది. ప్రతి పాత్రను తాను ఓ సవాల్‌గా తీసుకుంటానని, అంకితభావంతో పనిచేస్తానని తెలిపింది. తన తదుపరి చిత్రాల గురించి చెబుతూ ‘కార్తీతో కలిసి నటిస్తున్న సినిమాకు సంబంధించి 60శాతం చిత్రీకరణ పూర్తయింది. దీనితో పాటు హిందీ, తమిళ్‌లో కూడా కొన్ని సినిమాలు చేస్తున్నా’ అని చెప్పింది.



వ్యాంపైర్ పాత్రలో అమలాపాల్

వివాహానంతరం సినిమాలకు విరామాన్ని ప్రకటించిన కథానాయిక అమలాపాల్ కెరీర్‌లో సెకండ్ ఇన్నింగ్స్‌కు సిద్ధమవుతున్నది. దాదాపు రెండేళ్ల విరామం తర్వాత ఆమె ‘హాఫ్’ అనే వైవిధ్యమైన చిత్రంతో ప్రేక్షకుల ముందుకురాబోతున్నది. ఈ చిత్రం ఇప్పటికే టొరంటో, ఇఫీతో పాటు పలు అంతర్జాతీయ చిత్రోత్సవాల్లో ప్రదర్శితమైంది. హాలీవుడ్‌లో పాపులర్ అయిన వ్యాంపైర్ జానర్‌లో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు.ప్రతీకార కథాంశంతో రూపొందిన ఈ చిత్రంలో అమలాపాల్ మనుషుల రక్తం తాగే వ్యాంపైర్ పాత్రలో కనిపించనుంది. సమ్మద్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో ‘ప్రేమదేశం’ ఫేమ్ అబ్బాస్ కీలక పాత్రలో నటిస్తున్నారు. రాజస్థాన్ ఏడారిలో ఈ సినిమా చిత్రీకరణ జరిపారు. సగం మనుషులు, సగం వ్యాంపైర్లుగా ఉన్న అన్నాచెల్లెళ్ల కథగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. త్వరలో పాన్ ఇండియా స్థాయిలో ప్రేక్షకుల ముందుకురానుంది.

ఆకట్టుకుంటున్న ‘ట్రైన్’ ట్రైలర్!

మరో కొత్త సినిమాతో ప్రేక్షకుల ముందుకు విజయ్ సేతుపతి..





విలక్షణ నటుడు విజయ్ సేతుపతి ప్రధాన పాత్రలో దర్శకుడు మిస్కిన్ దర్శకత్వంలో తెరకెక్కిన హై-వోల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్ ‘ట్రైన్’. డిసెంబర్ 4న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానున్న నేపథ్యంలో, చిత్రబృందం తాజాగా అధికారిక ట్రైలర్‌ను విడుదల చేసింది.ఒక రద్దీగా ఉండే రైల్వే స్టేషన్ నుంచి బయలుదేరిన సూపర్‌ఫాస్ట్ రైలులో జరిగే అనూహ్య పరిణామాల చుట్టూ ఈ సినిమా కథ తిరుగుతుంది. ఒకవైపు రైలుకు బ్రేకులు ఫెయిల్ అవ్వడం, మరోవైపు సాయుధ దుండగులు రైలును హైజాక్ చేసి ప్రయాణికులను బందీలుగా పట్టుకోవడంతో పెను ప్రమాదం ముంచుకొస్తుంది. అదే రైలులో ప్రయాణిస్తున్న విజయ్ సేతుపతి, బందీలుగా ఉన్న ప్రయాణికుల ప్రాణాలను ఎలా కాపాడాడు అనేది ట్రైలర్‌లో అత్యంత ఉత్కంఠభరితంగా చూపించారు. ఈ చిత్రంలో విజయ్ సేతుపతితో పాటు శ్రుతి హాసన్, నాజర్, నరైన్, యుగి సేతు, కె.ఎస్. రవికుమార్, సంపత్ రాజ్, కలైయరసన్ మరియు బిగ్‌బాస్ ఫేమ్ త్రిగుణ్ కీలక పాత్రల్లో నటించారు. ముఖ్యంగా నాజర్ విలన్ ఛాయలున్న పాత్రలో పవర్‌ఫుల్‌గా కనిపిస్తూ ఆకట్టుకుంటున్నారు. 2020లో వచ్చిన ‘సైకో’ తర్వాత మిస్కిన్ దర్శకత్వం వహించిన చిత్రం కావడంతో దీనిపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాకు కథ, దర్శకత్వంతో పాటు సంగీతాన్ని కూడా మిస్కిన్ స్వయంగా అందించడం విశేషం. వి క్రియేషన్స్ పతాకంపై ప్రముఖ నిర్మాత కలైపులి ఎస్. థాను నిర్మించిన ఈ చిత్రం, ఇప్పటికే సెన్సార్ బోర్డు నుంచి యూ/ఏ (ఖ/ూ) సర్టిఫికెట్ పొంది డిసెంబర్ 4, 2026న ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమైంది.

Printed, Published and Owned by SITARALLA SRIRAMULU and Printed at M/s SRI DIVYA PRINTERS, Plot No. 33 & 34, 2nd Floor, Vasthu Colony, LB Nagar, Ranga Reddy, Telangana - 500074 and Published at H.No. 10-1-101/10. Bhagya Nagar Colony, Lingojiguda, Saroornagar, Ranga Reddy, Telangana - 500035. EDITOR: SITARALLA SRIRAMULU , RNI. No. TELTEL/2015/62524. Cell: 9966443465